


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 68 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా సోమవారం 19 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 68 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST MON 19 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# ఏపీ రాజధాని అమరావతే

- ఆయన బెంగళూరులో ఉంటే అదే రాజధాని అవుతుందా?: సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ 30వ వర్ధంతి సభలో నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ సంక్షేమ బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోందని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు, 'క్రెడిట్ చోరీ' ఆరోపణల ఖండన
- 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం
- రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఉపేక్షించబోమని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:** ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అవుతుందా? మరి ఆయన (జగన్) ఎక్కువగా బెంగళూరులో ఉండేవారు, అటువంటప్పుడు దాన్నే రాజధానిగా ప్రకటించాల్సింది అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజధాని విషయంలో గత పాలకులు సృష్టించిన గందరగోళానికి ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 30వ వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**ఏపీ రాజధాని అమరావతే**

రాజధానిపై ఐదేళ్లుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడిందని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ఐదేళ్లుగా మన రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితిలో బతికాం. మూడు రాజధానులంటూ గందరగోళం సృష్టించారు. కానీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మూడు రాజధానుల నినాదం ఎక్కడైతే బలంగా వినిపించారో, అక్కడి ప్రజలు కూడా ఎన్డీయే అభ్యర్థులనే గెలిపించారు. ఇకపై ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఎవరైనా ఏపీ రాజధాని ఏది అని అడిగితే, మనమంతా

వివరాలు 2లో..



## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

**పెన్ పవర్ డెస్క్:** భారత్ వంటి ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల కోసం అమెరికన్ వనరులను ఉపయోగిం చడాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంపై ఇక్కడి విద్యుత్తును ఉపయోగించి పనిచేస్తున్నాయని.. కానీ, భారత్ వంటి దేశాల్లో పెద్ద సంఖ్యలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. ఓ అమెరికన్ ఛానల్‌లో

వివరాలు 2లో..



## నేతలారా.. ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి

- అమ్ముడుపోయిన 'కోటరీల' మధ్య 'బందీలుగా' ఉన్న నాయకులారా ఆలోచించుకోండి: విజయసాయిరెడ్డి
- ప్రజా నాయకులకు విజయసాయిరెడ్డి సంచలన హెచ్చరిక
- వెనెజువెలా అధ్యక్షుడి ఉదంతాన్ని గుర్తు చేసిన వైనం
- అమ్ముడుపోయిన కోటరీల వల్ల ప్రమాదమని వ్యాఖ్య
- కోటరీల మధ్య నేతలు బందీలుగా ఉన్నారంటూ ఘాటు విమర్శ

**పెన్ పవర్ డెస్క్:** రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు ప్రజా నాయకులు తమ చుట్టూ ఉన్న కోటరీల మధ్య బందీలుగా ఉన్నారని, భవిష్యత్తులో వారికి ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు.వెనెజువెలాలో భారీ ప్రజాదరణ ఉన్న అధ్యక్షుడిని, ఆయన భార్యను అమెరికా సులువుగా ఎత్తుకుపోయిందని గుర్తు చేశారు. అధ్యక్షుడి చుట్టూ ఉన్న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ చీఫ్‌లు అమ్ముడుపోవడమే దీనికి కారణమని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. భారీ సైన్యం, యుద్ధ విమానాలు ఉన్నా ఎలాంటి ప్రతిఘటన లేకుండా ఇది జరిగిందంటే దానికి కారణం "వారంతా అమ్ముడు పోవటమే కదా" అని ట్వీట్ చేశారు.

వివరాలు 2లో..



## బాంబు బెదిరింపు... ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

- ఇండిగో విమానానికి బాంబు బెదిరింపుతో కలకలం
- ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళుతుండగా లక్నోకు మళ్లింపు
- విమానం టాయిలెట్‌లో టిష్యూ పేపర్‌పై బెదిరింపు నోట్
- ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడి
- బాంబ్ స్క్వాడ్‌తో విమానంలో విస్తృత తనిఖీలు

వివరాలు 2లో..

## ట్రంప్ మమ్మల్ని ఫూల్స్ ని చేశాడు
## ఇరాన్ నిరసనకారుల తీవ్ర ఆగ్రహం

- ఇరాన్ లో నిరసనకారులకు ట్రంప్ మద్దతు
- దాంతో మరింత రెచ్చిపోయి ఆందోళనలు చేసిన నిరసనకారులు
- ప్రభుత్వ అణచివేతలో 15,000 మంది మరణించారని ఆరోపణలు
- ట్రంప్ మాట మార్చి వెనక్కి తగ్గడంతో ప్రజల ఆగ్రహం
- తమను బలిపశువులను చేశారంటూ ట్రంప్‌పై ఇరానియన్ల విమర్శలు
- ఆర్థిక సమస్యలతో మొదలై రాజకీయ రూపుదాల్చిన ఆందోళనలు

**పెన్ పవర్ డెస్క్:** ఇరాన్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమను నమ్మించి మోసం చేశాడని, ద్రోహానికి పాల్పడ్డాడని అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ఇచ్చిన హామీలను నమ్మి తాము రోడ్లపైకి వస్తే, ఆయన తమను ఫూల్స్ ని చేశాడని, మాట మార్చి తమను

వివరాలు 2లో..



## వైసీపీ హయాంలో పల్నాడులో రక్తం ప్రవహిస్తే, ఇప్పుడు పొలాలకు నీళ్లు పారుతున్నాయి

- వైసీపీ నేతలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి ఫైర్
- వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ రంగు పులుముతున్నారంటూ ఆగ్రహం
- పల్నాడు ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- కుట్రల వల్లే వైసీపీ 11 సీట్లకు పరిమితమైందని విమర్శలు



**పెన్ పవర్ డెస్క్:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో రక్తం ఏరులై పారితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పంట భూములకు సాగునీరు పారుతోందని పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పల్నాడులో ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఆయన ఆదివారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి

వివరాలు 2లో..




## ఏపీ సమాచార కమిషన్‌కు కొత్త సారథులు...
## చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

- ఆర్టీఐ కమిషన్‌కు నూతన నియామకాలు.. ఐదుగురు కమిషనర్ల ఎంపిక
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్
- ముఖ్యమంత్రి నేతృత్వంలోని కమిటీ సిఫార్సులకు గవర్నర్ ఆమోదం
- నూతన కమిషనర్లు మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వరకు పదవిలో కొనసాగింపు

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషన్‌కు ప్రభుత్వం కొత్త సారథు లను నియమించింది. ప్రధాన సమాచార కమిషనర్‌గా (సీఐసీ)

వివరాలు 2లో..

## ఆరుగురు మావోయిస్టులు మృతి
## కొనసాగుతున్న ఎదురు కాల్పులు..

**పెన్ పవర్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్

వివరాలు 2లో..



## సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర..
## పేదల ఆకలి తెలిసిన నాయకుడు



- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద నివాళులర్పించిన నందమూరి కుటుంబం
- సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారన్న బాలకృష్ణ
- బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని గుర్తుచేసుకున్న బాలయ్య
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే టీడీపీ ముందుకు సాగుతోందని వెల్లడి

వివరాలు 2లో..




## ప్రైవేట్ స్కూల్ ఫీజులు ఎలా పడితే అలా పెంచితే కుదరదు..
## త్వరలో కొత్త చట్టం

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణలో ప్రైవేట్ స్కూల్ ఫీజుల పెంపుపై కళ్లెం వేసేందుకు సిద్ధమైంది ప్రభుత్వం. ఎలా పడితే అలా పెంచి విద్యార్థుల ను, తల్లిదండ్రు లను ఇబ్బందులకు గురిచేయకుండా కట్టడి చేయనుంది. అందులో భాగంగా కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ఫీజులు ఏటేటా పెంచకుండా రెండేళ్లకు ఒకసారి 8 శాతం లోపు పెంచుకునేలా చట్టం తీసుకురా నుంది. ఫీజుల పెంపు కోసం రాష్ట్ర ఫీ రెగ్యులేటరీ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. 8 శాతం లిమిట్ కు లోబడి పెంచేందుకు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బ్రేకులు ఫెయిల్

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు.ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి.

**మందలించారంటూ...**

ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది.

**అనేక మంది ఎమ్మెల్యేలపై...**

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

# నేతలారా.. ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి

- మొదటి పేజి తరువాయి

ఈ ఉదంతాన్ని ఉదాహరణగా చూపుతూ, "అమ్ముడు పోయిన కోటరీల మధ్య బందీలుగా ఉన్న ఓ ప్రజా నాయకులారా ఆలోచించుకోండి. భవిష్యత్తులో ఇక్కడ మీకూ ఏం జరగబోతోందో ఇప్పటికైనా గుర్తించండి!" అని ఆయన తన పోస్టులో ఘాటుగా హెచ్చరించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.విజయసాయిరెడ్డి గతంలో పార్టీకి రాజీనామా చేసే సమయంలో, జగన్ పై విమర్శలు చేయడం తెలిసిందే. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయనను తప్పుదారి పట్టిస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలో, వెనెజువెలా ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, విజయసాయిరెడ్డి "కోటరీ" అంటూ ట్వీట్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏపీ సమాచార కమిషన్‌కు కొత్త సారథులు...

- మొదటి పేజి తరువాయి

ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేడు ఉత్తర్వులు జారీ చేశారు.శ్రీనివాసరావుతో పాటు మరో నలుగురిని సమాచార కమిషనర్లుగా నియమించారు. వీరిలో వి. శరత్ చంద్ర కల్యాణ చక్రవర్తి, గాజుల ఆదెన్న (అనంతపురం), ఒంటేరు రవిబాబు (కడప), పరవాడ సింహాచలం నాయుడు (విశాఖపట్నం) ఉన్నారు. నియమితులైన వారంతా న్యాయవాద వృత్తికి చెందిన వారు కావడం గమనార్హం. ఈ కొత్త కమిషనర్లు మూడేళ్ల పాటు లేదా వారికి 65 ఏళ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) పదవిలో కొనసాగుతారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన, మంత్రులతో కూడిన సెలెక్షన్ కమిటీ చేసిన సిఫార్సులకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ నియామకాలను ఖరారు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కమిషన్‌లో ముగ్గురు సభ్యులు ఉండగా, తాజా నియామకంతో కమిషన్ బలం గణనీయంగా పెరిగింది. ఈ నియామకాలతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవుతుందని, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత మరింత పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# ఏపీ రాజధాని అమరావతే

- మొదటి పేజి తరువాయి

గర్వంగా, కాలర్ ఎగరేసి 'అమరావతి' అని చెప్పుకుందాం. ఇది మనందరి రాజధాని, ప్రజా రాజధాని, దేవతల రాజధాని" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**యుగపురుషుడికి నివాళి**

ఎన్టీఆర్ తెలుగు జాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ఏకైక నాయకుడని చంద్రబాబు కొనియాడారు. "ఎన్టీఆర్ మనకు భౌతికంగా దూరమై 30 ఏళ్లు గడిచినా, ఆయన స్ఫూర్తి మనతోనే ఉంది. ఒకప్పుడు మదరాసీలుగా పిలవబడిన తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఆయన ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు తీసుకెళ్లారు. పార్టీ స్థాపించిన కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన యుగపురుషుడు ఆయన. విద్యావంతులను, మేధావులను రాజకీయాల్లోకి ఆహ్వానించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు" అని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

**ఎన్టీఆర్ బాటలోనే సంక్షేమం**

ఎన్టీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తి అని చంద్రబాబు తెలిపారు. "ఆనాడు ఆయన రూ.2కే కిలో బియ్యం ఇచ్చి దేశంలో ఆహార భద్రతకు నాంది పలికారు. నేడు మేము అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. ఆయన రూ.35తో ప్రారంభించిన పింఛనును ఇప్పుడు రూ.4 వేలకు పెంచి గౌరవంగా అందిస్తున్నాం. ఆయన చూపిన బాటలోనే పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తున్నాం. ఇటీవల 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించాం, ఉగాది నాటికి మరో 5 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం" అని వివరించారు.

**భూ హక్కులకు తిరుగులేని భరోసా**

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. నాడు ఎన్టీఆర్ భూ రికార్డుల్లో పారదర్శకత కోసం మునసబు, కరణం వ్యవస్థను రద్దు చేస్తే, గత పాలకులు కొత్త అధికారులను సృష్టించి ప్రజల ఆస్తులు కొట్టేయాలని చూశారు. వారి కుట్రలను భగ్నం చేశాం. రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నాం. రీ-సర్వేను పక్కాగా పూర్తిచేసి, బ్లాక్ చైన్, క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. నిన్ననే కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇదీ తెలుగువారి సత్తా. కానీ కొందరు దీన్ని కూడా 'క్రెడిట్ చోరీ' అని విమర్శిస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం కోసం మేము 2,500 ఎకరాలు సేకరిస్తే, గత ప్రభుత్వం ఐదేళ్లు దాన్ని పక్కన పడేసింది. అమరావతిని స్మశానం అన్నారు. వారి క్రెడిట్ అంతా ఇసుక, మద్యం, మైనింగ్, డ్రగ్స్, గంజాయి మాత్రమే" అని ఆయన విమర్శించారు.

**జలయజ్ఞానికి పునరంకితం**

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "ఎన్టీఆర్ హయాంలో తెలుగుగంగ, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు పునాది పడింది. మేము అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని జలకళతో నింపుతాం. ఈ ఏడాదిలోనే వెలుగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేసి చూపిస్తాం. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. శ్రీకాకుళంలోని వంశధార నుంచి నెల్లూరులోని పెన్నా వరకు నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం" అని ప్రకటించారు.

**శాంతిభద్రతలపై ఉక్కుపాదం**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు హెచ్చరించారు. "రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలను టీడీపీ అంతం చేసింది. ఇప్పుడు కొంతమంది పొలిటికల్ రౌడీలు తయారయ్యారు.

ముఖ్యంగా పల్నాడులో గిల్లికజ్జాలు పెట్టుకుని రెచ్చగొడుతున్నారు. ఇలాంటివి మా దగ్గర నడవవు. నా దగ్గర తోక తిప్పలేరు. రాజకీయ ముసుగులో అరాచకాలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడితే పట్టుకొచ్చి బట్టలూడదీస్తాం. పల్నాడును ప్రక్షాళన చేసి శాంతియుత ప్రాంతంగా మారుస్తాం" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

**కార్యకర్తలే బలం.. కేంద్రంతో సమన్వయం**

కోటి మంది కార్యకర్తలున్న టీడీపీకి దేశంలో ఏ పార్టీకి లేనంత బలముందని చంద్రబాబు అన్నారు. "కష్టకాలంలో జై టీడీపీ, జై సీబీఎన్ అని నినదించిన కార్యకర్తలకు నా జీవితాంతం రుణపడి ఉంటాను. వారిని గౌరవంగా చూసుకునే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. జాతీయ రాజకీయాల్లో టీడీపీ ఎప్పుడూ కీలక పాత్ర పోషించిందని, ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, తాము కూడా కేంద్రానికి అదే స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. "దేశం బాగుండాలి, రాష్ట్రం ముందుండాలి, తెలుగుజాతి అన్నింటా ముందుండాలన్నదే నా ఆకాంక్ష" అని తన ప్రసంగాన్ని ముగించారు.

## బాంబు బెదిరింపు... ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఇండిగో విమానంలో బాంబు ఉందంటూ వచ్చిన బెదిరింపుతో తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ నుంచి బెంగాల్ లోని బాగ్డోగ్రా వెళుతున్న విమానాన్ని అత్యవసరంగా లక్నోకు మళ్లించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఆ సమయంలో విమానంలో ప్రయాణికులు, సిబ్బందితో సహా మొత్తం 238 మంది ఉన్నారు.

వివరాల్లోకి వెళితే, ఇండిగో విమానం 6జు-6650 ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బాగ్డోగ్రాకు బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, టాయిలెట్‌లోని ఒక టిష్యూ పేపర్‌పై బాంబు ఉన్నట్లు చేతితో రాసిన బెదిరింపు నోట్‌ను సిబ్బంది గుర్తించారు. వెంటనే పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ూుజ)ని ఉదయం 8:46 గంటలకు అప్రమత్తం చేశారు. అధికారుల సూచన మేరకు విమానాన్ని సమీపంలోని లక్నో విమానాశ్రయానికి మళ్లించారు. ఉదయం 9:17 గంటలకు విమానం లక్నోలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం విమానాన్ని వెంటనే ఐసోలేషన్ బేకు తరలించి ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. సమాచారం అందుకున్న బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై ఇండిగో ఎయిర్‌లైన్స్ స్పందించింది. ప్రయాణికుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపింది. ప్రయాణికులకు తాత్కాలికంగా అసౌకర్యం కలగకుండా ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ ప్రతినిధి వివరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## సినీ, రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర.. పేదల ఆకలి తెలిసిన నాయకుడు

దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఎన్టీఆర్ కుమారుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఏపీ సీఎం చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ, సుహాసిని తదితరులు పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ తనదైన చెరగని ముద్ర వేశారని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బాలకృష్ణ, ఎన్టీఆర్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. "మహానుభావులు కావాలంటే ఎంతో శ్రమ, దీక్ష అవసరం. ఆ లక్షణాలు ఎన్టీఆర్‌లో పుష్కలంగా ఉన్నాయి. సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయన బతికే ఉంటారు. సినిమాల్లో ఎవరూ చేయలేని పాత్రలు చేసి, నటనలో పరకాయ ప్రవేశంతో ఎన్నో ప్రయోగాలు చేశారు" అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి రాజకీయాల్లో సంచలనం సృష్టించారని, రాజకీయాలను కొందరికే పరిమితం కాకుండా అందరికీ చేరువ చేశారని తెలిపారు.

పేదల ఆకలి బాధ తెలిసిన నాయకుడు కాబట్టే బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచారని బాలకృష్ణ అన్నారు. అప్పట్లో ఆయన తీసుకొచ్చిన పథకాలే ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలవుతున్నాయని చెప్పారు. తెలుగు గంగ, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులతో ప్రజలకు మేలు చేశారని, ఆయన స్ఫూర్తితోనే టీడీపీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. తెలుగువారి గుండెచప్పుడు, కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీఆర్ అని, తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు.

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

- మొదటి పేజి తరువాయి

వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో నవారో ఈమేరకు వ్యాఖ్యలు చేశారు."భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లిస్తున్నారు? చాట్‌జీపీటీ అమెరికా గడ్డపై పనిచేస్తోంది. ఇక్కడి విద్యుత్తును ఉపయోగిస్తోంది. కానీ, భారత్, చైనా ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పెద్దఎత్తున వినియోగదారులకు సేవలు అందిస్తోంది" అని నవారో వ్యాఖ్యానించారు. అదే విధంగా అమెరికాలో వ్యవసాయ భూముల కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు.

అమెరికా (ఖూూ)తో వాణిజ్యం, రష్యాతో కొనసాగిస్తున్న విధానాలపై భారత్‌ను లక్ష్యంగా చేసుకుని నవారో గతంలోనూ పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. భారత్ అత్యధిక సుంకాలు విధించడం వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోందని నోరు పారేసుకున్నారు. భారత్ ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా (=బంంఖ) నుంచి తాము చమురు కొనుగోలు చేస్తోంది కేవలం ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది.

## వైసీపీ హయాంలో పల్నాడులో రక్తం ప్రవహిస్తే, ఇప్పుడు పొలాలకు నీళ్లు పారుతున్నాయి

- మొదటి పేజి తరువాయి

ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్న ఘర్షణకు రాజకీయ రంగు పులిమి, టీడీపీపై బురద చల్లేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో ఫ్యాక్షన్, అక్రమ మైనింగ్, దౌర్జన్యాలతో పల్నాడు ప్రాంతం వల్లకాడుగా మారిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన 300 మంది భయంతో ఊరు విడిచి పారిపోయారని గుర్తుచేశారు. ఒక్క పిన్నెల్లి గ్రామంలోనే జగన్ ఐదేళ్ల పాలనలో 12 మందిని హత్య చేశారని, వారిలో ఎస్సీ, బీసీలు కూడా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ కోసం తవ్విన గుంతల్లో పడి ఏడెనిమిది మంది చనిపోయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. బాధితులను పరామర్శించడానికి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పల్నాడుకు వస్తే, ఆయనను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గతంలో ఊరు విడిచి వెళ్లిన వారంతా ధైర్యంగా తిరిగి గ్రామాలకు వస్తున్నారని గొట్టిపాటి తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక పల్నాడు రైతులకు సాగునీటి కష్టాలు తీర్చామని, పొలాలకు నీటిని అందిస్తున్నామని వివరించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలన్నదే చంద్రబాబు ఆశయమని అన్నారు.

వైసీపీ కుట్రపూరిత, విధ్వంసకర రాజకీయాల వల్లే ప్రజలు ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని, అయినా వారికి బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. అక్రమ సంపాదనతో పుట్టిన పార్టీ వైసీపీ అని, తెలుగోడి

ఆత్మగౌరవం కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ అని మంత్రి గొట్టిపాటి వ్యాఖ్యానించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించిందని ఆరోపించారు. గ్రామాల్లో జరిగే హత్యలకు రాజకీయ రంగు పులిమి, ఎవరు చనిపోతారా అని ఎదురుచూస్తూ లబ్ధి పొందాలని వైసీపీ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొందని, దీనికి ఎవరు భంగం కలిగించినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలపై ఉక్కుపాదం మోపుతామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ లేని పల్నాడును నిర్మించి, ప్రతి రైతు కుటుంబంలో ఒక ఉద్యోగం కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి పునరుద్ఘాటించారు.

## ప్రైవేట్ స్కూల్ ఫీజులు ఎలా పడితే అలా పెంచితే కుదరదు..

- మొదటి పేజి తరువాయి

మాత్రమే అనుమతి ఉంటుంది. ఒక స్కూలుకు ఫీజు నిర్ణయించే ముందు ముఖ్యమైన డాక్యుమెంట్లు, స్కూల్ కు వస్తున్న రెవెన్యూ, ఆదాయం, ఖర్చుల వివరాలను పరిశీలించి కమిటీ అనుమతించనుంది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఫీజుల పెంపు నియంత్రణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి చేరింది. వచ్చే కేబినెట్ మీటింగ్ లో దీనిపై చర్చించనున్నారు. రాష్ట్రంలో ఉన్న11 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎక్కువ భాగం ఉన్న బడ్జెట్ స్కూల్స్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ఏడాదికి 5 శాతం చుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. రెండు సంవత్సరాలకు ఒకసారి ఎనిమిది శాతం ఫీజు పెంపుదల అనేది ఆమోదయోగ్యం కాదని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ చెబుతోంది. పెరుగుతున్న ధరలు, ఖర్చులు, టీచర్లు, సిబ్బంది జీతాల పెంపుదల.. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఏడాదికి ఒకసారి 5 శాతం ఫీజులు పెంచుకునేలా అనుమతివ్వాలని కోరుతున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో, ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీలకు ఫీజులను నిర్ణయించే తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ తరహాలో, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి 10 నుండి 15 శాతం ఫీజు పెంపును సిఫార్సు చేసింది.ఫీజు పెంపు కోసం, రాష్ట్ర స్థాయిలో సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఈ కమిటీలో సీనియర్ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, పాఠశాల నిర్వహణ సభ్యులుగా ఉండాలని సూచించింది.

కలెక్టర్ నేతృత్వంలో జిల్లా వారీగా ఫీజు నియంత్రణ కమిటీని కూడా కమిషన్ సిఫార్సు చేసింది. కన్స్యూమర్ ఇండెక్స్ ను పరిగణనలోకి తీసుకుని ఫీజు పెంపు ప్రతిపాదించడమే కాకుండా, కమిషన్ మూడు సంవత్సరాల లాక్-ఇన్ వ్యవధిని సూచించింది.

## ట్రంప్ మమ్మల్ని ఫూల్స్ ని చేశాడు

- మొదటి పేజి తరువాయి

నట్టేట ముంచాడని ఆవేదన చెందుతున్నారు.ఇరాన్‌లో ఆర్థిక సమస్యలపై మొదలైన ఆందోళనలు ప్రభుత్వ మార్పు డిమాండ్‌తో ఉద్ధృతంగా మారినప్పుడు, ట్రంప్ సోషల్ మీడియా వేదికగా నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. "త్వరలోనే సహాయం అందుతుంది" అని, శాంతియుత నిరసనకారులపై హింసకు పాల్పడితే అమెరికా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. దీంతో అమెరికా సైనిక చర్య తీసుకుంటుందనే ఆశతో చాలామంది నిరసనల్లో పాల్గొన్నారు.అయితే, ఇరాన్ ప్రభుత్వం ఈ నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసింది. స్నైపర్ ఫైరింగ్, మెషీన్ గన్లతో జరిపిన దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని (దాదాపు 15,000 మంది మరణించారని అంచనా) నివేదికలు వచ్చాయి. అయితే, ట్రంప్ తన వైఖరిని మార్చుకుని, ఇరాన్ ప్రభుత్వం హత్యలు ఆపేస్తామని హామీ ఇచ్చిందని, సైనిక చర్య ఉండదని ప్రకటించారు. ఈ పరిణామంతో నిరసనకారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.ట్రంప్ చర్యలపై ుxవీజు పత్రికతో పలువురు ఇరానియన్లు తమ ఆవేదనను పంచుకున్నారు. "ఈ 15,000 మరణాలకు ట్రంపే బాధ్యుడు. ఆయన పోస్టులు చూసే చాలామంది రోడ్లపైకి వచ్చారు" అని టెహ్రాన్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అన్నారు. "ట్రంప్ మమ్మల్ని యుద్ధంలో బలిపశువులుగా వాడుకున్నారు. మా కాళ్ల కింద నుంచి నేల లాగేశారు" అని మరికొందరు ఆరోపించారు.

వాస్తవానికి, దేశంలో కరెన్సీ విలువ పడిపోవడం, ధరల పెరుగుదల వంటి ఆర్థిక సమస్యలతో ఈ నిరసనలు మొదలయ్యాయి. అయితే, ఇవి క్రమంగా ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలుగా మారాయి. ఇరాన్ అధికారులు మాత్రం ఈ నిరసనలను అమెరికా కుట్రగా అభివర్ణిస్తున్నారు. ట్రంప్ తీరుతో ఇరాన్ ప్రజల్లో ఆయనపై తీవ్ర అపనమ్మకం నెలకొంది.

## ఆరుగురు మావోయిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపుర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## మీకోసం కాల్ సెంటర్ సేవల ద్వారా సమస్యలు పరిష్కారం



**అమలాపురం/ అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 18:** మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకుని సమస్యలను సమగ్రంగా పరిష్కరించు కోవాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో అర్జీదా రులకు పిలుపు నిచ్చారు. ఈనెల 19 వతేదీ సోమ వారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్య ల పరిష్కార వేదిక కార్యక్ర మాన్ని ఉదయం 10:00 నుండి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాస్థాయిలో సమస్యలు ఉన్నవారు ఈ యొక్క జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యా దులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడా నికి 1100 నంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీ దారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవ డానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నా రు. అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రెవెన్యూ క్లినిక్ పేరిట నాలుగు కౌంటర్లు సమస్యలు పరిష్కారం కొరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిం చడం జరుగుతుందని, ఈ కార్య క్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొం టారని కావున స్వయంగా వారి దృష్టికి సమస్యలను తీసుకుని వెళ్లే అవకాశం ఉందన్నారు జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సంక్షేమం మరచిన కూటమి ప్రభుత్వం..

* కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ధరణాలకోట



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 18:**కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం విస్మరించిందని, గ్రామీణ ప్రాంతాల్లో పండగ వాతావరణం ఎక్కడా కనిపించలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన కార్మికులకు సీట్లు పంపిణీ చేసి వినూత్నంగా కూటమి సంక్షేమంపై నిరసన వ్యక్తం చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి అంటున్న కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం అయిందని ఈ రెండు ఎక్కడ కనిపించడం లేదన్నారు. సంక్రాంతి సంబరం ప్రజల్లో ఎక్కడ కనిపించలేదని కొనుగోలు శక్తి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాకర నాగేశ్వర రావు,మూరా రాంబాబు,బత్తుల వెంకటేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీరాజాపురంలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి



**గండేపల్లి, పెన్ పవర్, జనవరి, 18:**గండేపల్లి మండలం ఎన్ టి రాజా పురం గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న గండేపల్లి పిఎసిఎస్ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ మరియు ఎక్స్ పిఎసిఎస్ చైర్మన్ కేతిన బాబి ఆధ్వర్యంలో నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

### ప్రజా సేవకు పరమార్థం రక్తదానం

## ఎన్టీఆర్ ఆశయాల సాధనకు కృషి

**రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం పెన్ పవర్, జనవరి 18:** తెలుగు జాతి ఆణిముత్యం, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వర్ధంతి సందర్భంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, మన బాధ్యత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం రూరల్ మండలం మాలపాడు గ్రామంలో ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, ప్రజల హక్కులు, ఆత్మగౌరవం,సామాజిక న్యాయమే ఎన్టీఆర్ రాజకీయ తత్వమని తెలిపారు. అటువంటి మహానాయకుడి స్మృతిలో రక్తదాన శిబిరం నిర్వహించడం ప్రజా సేవకు సార్థక రూపమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు.రక్తదానం అత్యవసర వైద్య అవసరాలను తీర్చడమే కాకుండా, దాత ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని, ప్రమాదాలు, ప్రసూతి సమస్యలు, శస్త్రచికిత్సలు వంటి సంక్షోభ సందర్భాల్లో రక్తం ప్రాణాధార మవుతుందని మంత్రి వివరించారు. యువత, పార్టీ శ్రేణులు, సామాజిక కార్యకర్తలు విస్తృతంగా రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.ఎన్టీఆర్ బాటలో ప్రజల కోసం పనిచేయడమే నిజమైన రాజకీయ సేవ అని స్పష్టం చేస్తూ, రక్తదానం చేసిన ప్రతి దాత మానవీయంగా సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని రక్తదానం చేసి ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచిన మంత్రి సుభాష్నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాలపాడు గ్రామంలో అంబేద్కర్ మెమోరియల్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ కార్యక్రమంలో పాల్గొని కొద్దిసేపు యువతతో కలిసి క్రికెట్ ఆడి అలరించారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రికెట్ కిట్స్, స్పోర్ట్స్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. మంత్రి యువతతో కలిసి క్రికెట్ ఆడటం పట్ల గ్రామస్తులు, యువకులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మన బాధ్యత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు గారా అజయ్ కుమార్, జోనల్ ఇన్ ఛార్జ్ కాశీ నరేంద్ర, అంబేద్కర్ మెమోరియల్ క్రికెట్ యూత్ సభ్యులు, మాలపాడు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.మన బాధ్యత ఫౌండేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు బత్తుల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, సంజీవని వాలంటరీ బ్లడ్ సెంటర్ సహకారంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, నాటక అకాడమీ చైర్మన్ పెంకే అన్నపూర్ణ, కాజులూరు మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), మేడిశెట్టి సూర్యనారా యణ, కవల నానాజీ తదితరులు పాల్గొన్నారు.గత 15 సంవత్సరాలుగా అనేక సేవా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మన బాధ్యత ఫౌండేషన్ సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ల

### ఆలమూరు మండలంలో ఘనంగా

## ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు.



**ఆలమూరు,పెన్ పవర్, జనవరి 18;**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 30వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని 18 గ్రామాల్లో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రమైన ఆలమూరు బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి ఘనతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు పద్మశ్రీ నందమూరి తారక రామారావు అని,అయన పేదలకు చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ఆలమూరు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ ఈదల రాంబాబు,మాజీ జడ్పిటిసి రామానుజన్ శేషగిరిరావు,సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ కేతా రాంబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, పంచాయతీ వార్డు నెంబర్ గొడవర్తి నారాయణ,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి సత్యనారాయణ, బూత్ కన్వీనర్ నెల్లి చిన్న, లంక శ్యామ్, కర్రి శీను, జనార్ధన స్వామి దేవస్థానం చైర్మన్ బైరవశెట్టి రాంబాబు, బొబ్బా రాంబాబు, కొండేపూడి సతీష్.ముప్పిరి వీరయ్య, మానేపల్లి శీను,కూటమి నాయకులు పాల్గొనడం జరిగింది.

## సార్లంక బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలి.




కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 18:సార్లంక బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని కాకినాడ జిల్లా వైసిపి అధ్యక్షులు దాడిశెట్టి రాజా కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రౌతులపూడి మండలం సార్లంక గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సుమారు 34 ఇళ్లు అగ్ని ప్రమాదంలో కాలిపోవడం జరిగింది అగ్ని బాధిత కుటుంబాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా,ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు,ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు పరామర్శించారు.కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా ఒక్కొక్క కుటుంబానికి 10,000 రూపాయలు 34 కుటుంబాలకు 340,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసారు.ముదునూరి మురళీ కృష్ణంరాజు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ఒక్కొక్క కుటుంబానికి 5,000 రూపాయలు 34 కుటుంబాలకు 170,000 రూపాయలు ఆర్థిక సాయంతోపాటు బట్టలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్ గారు,మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మి కుమారి గారు,రౌతులపూడి జడ్పీటీసీ చిన్నదివానం గారు,వాసిరెడ్డి భాస్కర్ బాబు గారు వైఎస్ఆర్సిపి ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు

## గంగవరం మండలంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



ఎన్టీఆర్ సేవలకు టీడీపీ నాయకుల ఘన నివాళులు

**కె. గంగవరం, పెన్ పవర్, జనవరి 18** తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానాయ కుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) వర్ధంతి కార్యక్రమాలను గంగవరం మండల పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.అలాగే రామచంద్రపురం లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ సీనియర్ నాయకులు చంద్రు వీర్రాజు చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన పేదల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను కొనియాడారు.అలాగే కె. గంగవరం బస్ స్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కూడా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలోకుందూరు సొసైటీ అధ్యక్షులు జగతా రమణ, స్వచ్ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్,కె.గంగవరం గ్రామ పార్టీ అధ్యక్షులు అల్లూరి సతీష్, మండల తెలుగుయువత అధ్యక్షులు అల్లూరి విజయ్, టీడీపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి మురార్జి, వెంటూరి వీర్రాఘవులు చౌదరి, వాసంశెట్టి కృష్ణ, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివ, వాసంశెట్టి నాగేంద్ర,గన్ని శ్రీను, కంటిపూడి అబ్బు, ములకల రామచంద్రరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరివాడ చిన్నికృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు డీసీ నిడదవోలు సుబ్బు, కోరిపెల్ల సుబ్బారావు, చిర్రా రాజకుమార్,వట్టికూటి రాంప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు సలాది సాయిబాబు, గొల్ల పాలెం సొసైటీ అధ్యక్షులు అంగర కృష్ణ,టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి హనుమంతు చౌదరి ,కొప్పిశెట్టి లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 18:** మండలంలోని పెదశంకర్లపూడి టిడిపి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా ఎన్టీఆర్ 30 వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు రూ. 2 రూపాయలకే కిలో బియ్యం, సామాజిక భద్రతా పింఛన్లు, పక్కా ఇళ్ల నిర్మాణం, రైతుకు విద్యుత్, మండల వ్యవస్థతో స్థానిక స్వపరిపాలన, ఆడబిడ్డలకు ఆస్తిలో హక్కు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీ రామారావు కు దక్కుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగువారిని ప్రపంచం ముందు ప్రత్యేకంగా నిలబెట్టారన్నారు. ఆయన ఆశయాలను తమ అధినేత చంద్రబాబు, లోకేష్ లు నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాది, విలేజ్ ఇండస్ట్రీ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, అమరాది, వెంకట్రావు, యళ్ల జగదీష్, వెలుగుల నాని, పంచాది వీరబాబు, రొంగల నాగేశ్వరరావు, మంతెన శ్రీను, పల్లా గోపి, తదితరులు పాల్గొన్నారు

## ఏడు వారాల వెంకన్న దర్శనం ఏడెడు జన్మల పుణ్యఫలం..





**ఆత్రేయపురం పెన్ పవన్ జనవరి 18:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.
ఏడు వారాల నోము సందర్భంగా భక్తుల రద్దీ భారీగా ఉండటంతో ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు,ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ దర్శనాలు నిరాటంకంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. భారీ రద్దీ ఉన్నప్పటికీ ఆలయ సేవలు క్రమబద్ధంగా కొనసాగాయి.

## కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి లక్ష రూపాయలు విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 18:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో ఆదివారం విశిష్ట పూజా కార్యక్రమాలు అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు భక్తిశ్రద్ధలతో సాగాయి.ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన ట్రస్ట్‌కు రావులపాలెం గ్రామానికి చెందిన దివ్య సిల్క్స్ నిర్వాహకులు సమయమంతుల నరసింహారావు రేఖ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. విరాళం అందించిన దంపతులను ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.ఆలయ కమిషనర్ నల్ల సూర్య చక్రధరావు స్వామి వారి చిత్ర పట్టాన్ని అందించారు.

## నటసార్వభౌమ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**ఆత్రేయపురం పెన్ పవర్ జనవరి 18:**విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావువర్ధంతి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రామ టిడిపి అధ్యక్షులు పెండం వెంకన్న ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ నటుడిగానే కాకుండా ప్రజానాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జగన్మోహిని కేశవ స్వామి ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర గౌడ్, గ్రామ టిడిపి నాయకులు బండారు వెంకయ్య, ఉల్లవల్ల కృష్ణ, కందుల రాంబాబు, షేక్ గౌస్, గుడపాటి శ్రీను,తో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయానికి రూ.లక్ష విరాళం



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 18;**మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయానికి రాయవరం మండలం పసలపూడికి చెందిన సత్తి వీర రాఘవరెడ్డి దంపతులు రూ.1,01,116 లు విరాళం అందజేశారు. ఇటీవల కాలంలో ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఆలయ అభివృద్ధిలో తన వంతు భాగంగా ఈ విరాళాన్ని వీర రాఘవరెడ్డి దంపతులు ఆదివారం ఆలయం కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వీరి అప్పారావు కు అందజేశారు. విరాళం అందించిన వీర రాఘవరెడ్డి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, గన్ని వెంకట్రావు, గన్ని సూరిబాబు, దొమ్మేటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఊడుగులమ్మ గరగోత్సవానికి ఎమ్మెల్యే బండారు

**ఆలమూరు,పెన్ పవర్, జనవరి 18;**మండలంలోని మోదుకూరులో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ ఊడుగులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు వెంట కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు,వాడపల్లి దేవస్థానం డైరెక్టర్ సలాది నాగేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు రాగా అమ్మవారి గరగోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముందుగా ఆలయ కమిటీ పెద్దలు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ ఏడాది జాతర, తీర్థ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా వారంతా అభినందించారు. అలాగే ఆలయ ముందు భాగంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి వారిని వారు దర్శించుకున్నారు.

అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. అమ్మవారి దర్శన భాగ్యం కల్పించిన కమిటీ



సభ్యులకు గ్రామస్తులకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రు శ్రీనివాస్, రాయుడు సుధాకర్, తదితర నాయకులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాలో 25 మందికి ఉద్యోగ అవకాశాలు

**రామచంద్రపురం, పెన్ పవర్, జనవరి 18 :**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాలో భాగంగా, ఆదివారం జరిగిన 33వ జాబ్ మేళా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఉపాధి విభాగం మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ జాబ్ మేళాలో మొత్తం 25 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు.
వివరాలు ఇలా ఉన్నాయి:
రేడియంట్ టెక్నాలజీస్ 9 మంది
జెన్ టెక్నాలజీస్ 13 మంది
జెన్పాక్ట్ ప్రాథమికంగా 3 మంది
ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత సత్యం గారికి, ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్ కుమార్ గారికి, అలాగే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గారికి




కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహణ




**కాకినాడ, పెన్ పవర్, జనవరి 18 :**ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), మండల తహసీల్దార్లు తప్పనిసరిగా ఉదయం 10.00 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు హాజరై ప్రజల వినతులను స్వీకరిస్తారని తెలిపారు.అలాగే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఏఓలు, డీటీలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రైతులు మరియు సాధారణ ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సంబంధిత సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## సిడబ్ల్యుసి మెంబర్ గిడుగు రుద్రరాజు పుట్టినరోజు వేడుకలు



**పెన్ పవర్, జనవరి 18** మాజీ పిసిసి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ సీడబ్ల్యుసి మెంబర్ గిడుగు రుద్రరాజు పుట్టినరోజు వేడుకలు అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ అయితాబత్తుల సుభాషిని ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ మండలం మనోవికాస కేంద్రంలో పిల్లల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి ప్రారంభించారు. అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంటెద్దు బాబి పిల్లలకు స్వీట్లు, బిస్కెట్లు, బన్నులు, పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ మాజీ అధ్యక్షులు కుడిపూడి శ్రీనివాసరావు, ఏఐసీసీ యార్లగడ్డ రవీంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేరు శర్మ, వస్కా బాబు, మహబూబ్ షకీలా, వాకపల్లి రాంబాబు, అరిగెల శ్రీరామ్మూర్తి, మండల అధ్యక్షులు పోలిశెట్టి హరిబాబు, అప్పల శ్రీ రామకృష్ణ, ఏ.రాధాకృష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు, దేవరపల్లి రాజేంద్ర బాబు, మాచవరపు శివన్నారాయణ, మహమ్మద్ ఇస్మాయిల్, ఆదుర్తి నారాయణమూర్తి, దొమ్మేటి వినోద్, అడపా మాచర రావు , అడబాల రాము, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు

**జగ్గంపేట, పెన్ పవర్, జనవరి 18**: జగ్గంపేటలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథులుగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జగ్గంపేట టిడిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 150 మంది టీడీపీ నాయకులు, రక్తదానం చేయగా ఈ రక్తాన్ని కాకినాడ శ్రీ యువసేన రక్త నిధి కేంద్రం సతీష్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు రక్తాన్ని ఇచ్చి శిబిరాన్ని ప్రారంభించారు. తాళ్లూరు వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్, ఎన్టీఆర్ వీరాభిమాని దాపర్తి సీతారామయ్య స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఒక ధ్రువతార ఎన్టీఆర్ కోల్పోయి 30 సంవత్సరాలు గడిచిందని ఆయన తెలుగు ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. ఇటువంటి మహనీయుడు ఆత్మకు శాంతి



చేకూరాలని ఆయన ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, బస్వా వీరబాబు, అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, వీరంరెడ్డి కాశిబాబు, తోట రవి, కుంచె రాజా, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, బుర్రి సత్తిబాబు, తోట గాంధీ, కంటిపూడి సత్యనారాయణ, నీలం శ్రీను, అనుకూల శ్రీకాంత్, క్లీన్ అండ్ బ్యూటిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గెద్దాడ సత్యవేణి, మండల మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి నాలుగు మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సార్లంక బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.



**-వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు డిమాండ్.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 18:**రౌతులపూడి మండలం సార్లంక అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు డిమాండ్ చేశారు.సార్లంక అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ఒక్కొక్క కుటుంబానికి 5,000 రూపాయలు చొప్పున 34 కుటుంబాలకు మురళీకృష్ణంరాజు చేతుల మీదుగా 170,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడమే కాకుండా, బట్టల పంపిణీ చేసి ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నిలువ నీడ లేకుండా పోయిన సార్లంక అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం కాకుండా, త్వరితగతిని పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు ఎంపికైన దివ్యాంగ విద్యార్థులు

- సత్యం వాసంశెట్టి ఫౌండేషన్
- రూ.20,600 ఆర్థిక సాయం



**రామచంద్రపురం, పెన్ పవర్,జనవరి 18 :**
రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు భవిత కేంద్రంలో చదువుకుంటూ ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్ శిక్షణకు ఎంపికైన దివ్యాంగ విద్యార్థులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అండగా నిలిచారు. శిక్షణకు అవసరమైన ఖర్చుల నిమిత్తం రూ.20,600/- ఆర్థిక సహాయం అందించి విద్యార్థులను ప్రోత్సహించారు.
వివరాల్లోకి వెళితే, కాజులూరు భవిత కేంద్రంలో చదువుతున్న పితాని రూపాసాయి (9వ తరగతి), సి.హెచ్. వేణు శ్రీ (ఓపెన్ ఇంటర్), దాసరి శివ శేషాద్రి (9వ తరగతి) అనే ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు సమగ్ర శిక్షా ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్ శిక్షణకు ఎంపిక య్యారు.ఈ విషయాన్ని విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న కోచ్ ఎం. జయ ప్రకాష్ రెడ్డి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం దృష్టికి తీసుకువచ్చారు. గండికోటలో నెలరోజుల శిక్షణ అనంతరం లడఖ్‌లో అడ్వెంచర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు.దీనికి స్పందించిన మంత్రి సుభాష్ విద్యార్థులను అభినందిస్తూ, వారి రవాణా మరియు ఇతర ఖర్చుల కోసం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.20,600/- ఆర్థిక సహాయం అందించారు.దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించినందుకు విద్యార్థులు, కోచ్ జయ ప్రకాష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ పెంకె అన్నపూర్ణ, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు కంచుమర్తి బాబురావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతి కి పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు...



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 18:** పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసన మహా నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారకరామారావు వర్ధంతి ని బండారులంకలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ వద్ద ఉన్న ఎన్ టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహోన్నత మైన నాయకుడు ఎన్ టిఆర్ అని ఆయన చేసిన సేవలు మరువరానివని అన్నారు. అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో
డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి బాబ్జీ, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు...

## నూకాంబిక ఆలయ అభివృద్ధికి భారీ విరాళం



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 18;** ఆలమూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ మురళీకఅష్ణ సంస్థల అధినేత, నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, విశాలాక్షి దంపతులు మండలంలోని చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు నిమిత్తం రూ. 2,01,116 భారీ విరాళం అందించారు. ఇటీవల కాలంలో ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం తన వంతు భాగంగా ఈ విరాళాన్ని పాపారావు దంపతులు ఆదివారం ఆలయం కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వీరి అప్పారావు కు అందజేశారు. విరాళం అందించిన పాపారావు దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, గన్ని వెంకట్రావు, గన్ని సూరిబాబు,దొమ్మేటి రామకృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమన్వయంతో కలిసి పని చేయాలి.

- ముదునూరి మురళీకృష్ణంరాజు.






**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జనవరి 18:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఉండి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఉండి నియోజకవర్గం ఇంచార్జ్ పి.వి.ఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసాపురం నియోజవర్గం ఇన్చార్జ్ ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయడమే కాకుండా, రానున్న ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జెడ్పిటిసిలు,ఎంపీపీలు,ఎంపిటీసీలు,సర్పంచులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు





## పోటెత్తిన భక్తజనం ...

### దుర్గమ్మ తోటలో కోలాహలం
### భక్తజనముతో నిండిపోయిన పంట పొలాలు
### ట్రాఫిక్ అంతరాయంతో ఇబ్బందులు పట్ల భక్తులు

**గండేపల్లి, పెన్ పవర్ , డిసెంబర్ ,18**
గండేపల్లి మండలం మురారి పంట పొలాల్లో వేంచేసియున్న దుర్గమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు. సంక్రాంతి పురస్కరించుకుని వచ్చిన బంధువులు సంక్రాంతి వెళ్లిన మొదటి ఆదివారం అమావాస్య కలిసి రావడంతో స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పంట పొలాలు వచ్చిన భక్తులతో నిండిపోయాయి. అమ్మవారికి మొక్కిన మొక్కులు తీర్చుకుని వంట వార్పు అక్కడే నిర్వహించుకుని భోజన, ప్రసాదాలు స్వీకరించారు. ఇతర ప్రాంతాల నుండి భారీగా ఒక్కసారిగా భక్తులు రావడంతో ట్రాఫిక్ అంతరాయం చోటుచేసుకుని భక్తులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ నియంత్రణ నకు జగ్గంపేట సిఐ .వై ఆర్ .కె .శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్సై శివ నాగబాబు గట్టి బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ నియంత్రణ దాంతో భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.
అంతేకాకుండా భక్తులకు ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు కల్పించింది.

## తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి ఎన్టీఆర్...





- కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోహనరావు
- ఎన్టీఆర్ 30 వ వర్ధంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం నిర్వహించిన గండేపల్లి టిడిపి నాయకులు

**గండేపల్లి, పెన్ పవన్, జనవరి 18:** తెలుగువారి ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి స్ఫూర్తి తెలుగువారి గుండెల్లో ఎల్లప్పుడూ సజీవంగా ఉంటుందని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు పేర్కొన్నారు. గండేపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్లో గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్30వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 50 మంది నిరుపేదలకు వస్త్ర దానం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ తెలుగు జాతి ముద్దుబిడ్డ అన్న ఎన్టీఆర్ అని, అటు సినిమా రంగాన్ని ఇటు రాజకీయ రంగాన్ని ఏలిన యుగ పురుషుడని, ఆనాడు ఎన్టీఆర్ ముందుచూపుతో ఆలోచించి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఈరోజు ప్రతి పేదవాడికి శ్రీరామరక్షగా ఉన్నాయని అందుకే ఎన్టీఆర్ ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, తెలుగు జాతి యొక్క ఖ్యాతిని భారతదేశానికి కాదు ప్రపంచానికే తెలియజేసి వ్యక్తి ఎన్టీఆర్ అని తెలుగువాడి ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి ఎన్టీఆర్ అని, భారతదేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ పేదవాడికి పట్టడు అన్నం పెట్టాలనే ఉద్దేశంతో ఆ రోజుల్లో రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ప్రారంభించిన మహనీయుడు అన్న ఎన్టీఆర్ అని కొనియాడారు. ప్రతి పేదవాడికి కూడూ, నీడ, గుడ్డా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నో ఉన్నతమైన కార్యక్రమాల చేసిన ఘనత ఒక్క ఎన్టీఆర్ కేదక్కుతుందని, అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న మా ప్రియతమ నాయకులు జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ నాయకత్వంలో ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధి అందిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను తెలుగుదేశం పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని అన్నారు.
ఈ కార్యక్రమంలో గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు వెంపాటి రాజు, సుంకవిల్లి రమేష్, రెడ్డి సుబ్బారావు, ఆళ్ల సత్తిబాబు, చంద్రు బ్రహ్మరాజు, పోతుల బుల్లిదొర,పైల వెంకన్న, ఉప్పలపాటి సత్తిబాబు, వెంపాటి సతీష్, బొల్లిన వేణు, కంటిపూడి సతీష్, ఇనప కోళ్ల సంజీవయ్య, వెంపాటి రాంబాబు,ముంగర సూర్యారావు, పెనుగాడి నాగరాజు, ముంగర విష్ణుమూర్తి,బుగతా నూకరాజు, సనుమూరి అప్పారావు, ఏక నాగరాజు, ఏక పరదేశి నాయుడు, దారా కాటయ్య సానిపినీ తాతారావు, కుమ్మకూరి శ్రీను, గుర్రం శేఖర్, గరికపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ మెచ్చిన ఒకే ఒక్క నాయకుడు ఎన్టీఆర్.



- రాష్ట్ర టిడిపి బీసీ సెల్ కార్యదర్శి పైల.
- ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలి.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 18:** ప్రజలందరూ మెచ్చిన ఒకే ఒక్క నాయకుడు దివంగత నేత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు అని టిడిపి సీనియర్ నాయకుడు పైల సత్యనారాయణ అన్నారు. వృద్ధాప్యంలోనూ అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న సత్యనారాయణకు ఎన్టీఆర్ అంటే ఎనలేని అభిమానం. ఈ పరిస్థితుల్లో ఆయన తన స్వగృహంలోనే కుర్చీకి పరిమితమైన స్థితిలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించి కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పెట్టిన అనతి కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన ప్రాంతీయ పార్టీ నాయకుడు ఎన్టీఆర్ మాత్రమే అన్నారు. రాష్ట్రంలో మాండలిక వ్యవస్థను ప్రవేశపెట్టి, అనేక ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. కిలో రెండు రూపాయల బియ్యం, పేదవారికి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చిన ఘనత ఎన్టీఆర్ ది అని అన్నారు. సామాన్యుడి కి కూడా రాజ్యాధికారంలో భాగం ఇచ్చింది ఎన్టీఆర్. రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలుపరిచింది ఎన్టీఆర్ ప్రభుత్వం మాత్రమే అన్నారు. ఎన్టీఆర్ కు కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని పైల డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువాడి యశస్సును చాటిన తెలుగు తేజం, మహనీయుడు ఎన్టీఆర్ మాత్రమే అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు టిడిపిని వీడలేదు. ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొనే టిడిపి కష్టకాలంలో కూడా సత్యనారాయణ ఎన్టీఆర్ వెంటే ఉన్నారు.
ఈ కార్యక్రమంలో సామంతుల భక్తాంజనేయులు, దత్తి దొర, కోరాడ రాము, సామంతుల ఫణికుమార్, కూన అప్పారావు, బళ్లారి శ్రీను, శిడగం రవి, సతివాడ రాఘవ, కర్రోతు జానకిరామ్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం మండలంలో.....
## ఎన్టీఆర్ కు నివాళులర్పించిన టిడిపి శ్రేణులు.

- ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 18:** మండలంలో పలు గ్రామాల్లో దివంగత నేత టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా టిడిపి శ్రేణులు ఆదివారం నివాళులు అర్పించారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు దనేకులు వీరభద్రం, ఓనుం మంగ శ్రీనివాస్,సంఘన ప్రబోజి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు బచ్చల శివ, దనేకుల అదృష్టదీపుడు ఏర్పాటు చేసినటువంటి నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి సభకు ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత ఎన్టీ రామారావు చిరస్మరణీయుడు అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలు, సంస్కరణలు , ప్రవేశపెట్టిన పథకాలు ద్వారా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల పెదబాబు, బస్సా ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, కొప్పుల బాబ్జి, కొప్పిశెట్టి సూరిబాబు, నూకతాటి ఈశ్వరుడు తూర్పు లక్ష్మీపురం బోసు,వెలుగురి హరే రామ్, బేరి ప్రభాకర్ ,జనసేన పార్టీ నాయకులు సాగి వెంకటరమణ, దొడ్డి శ్రీనివాస్, దొడ్డి దుర్గా ప్రకాష్, సాగి బంగారు రాజు, సాల వీరబాబు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
అలాగే ఏలేశ్వరం పట్టణంలో కాలేజీ రోడ్ లో జిల్లా శాఖ గ్రంధాలయ వద్ద, లింగవరం కాలనీ టిడిపి కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి లు
ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పళ్ళు పంపిణీ చేశారు. అలాగే పాత బస్టాండ్ వద్ద, ఎన్టీఆర్ సెంటర్ వద్ద వైభోగుల సుబ్బారావు, బూర్ల సత్తిబాబు ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఆయా వేదికల వద్ద వారు మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అన్నారు. ఈ కార్యక్రమాల్లో కర్రోతు గాంధీ, వాగు రాజేష్, బుగతా శివ, మామిడి లలిత, పెంద్ర శ్రీను, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ,సామంతుల గోపి, రుచి రమేష్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆశాజ్యోతి స్వర్గీయ ఎన్ టిఆర్ వర్ధంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 18:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆశాజ్యోతి స్వర్గీయ నందమూరి తారక రామారావు 31 వ వర్ధంతి సందర్భంగా పుల్లేటికుర్రు పంచాయతీ దగ్గర ఆయనకు ఘన నివాళులర్పించారు. వక్కలంక బుల్లియగారి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 15 మంది మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు, వార్డు సభ్యులు కత్తుల బాలస్వామి స్టీల్ బిందు బహుకరించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ పేద ప్రజలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. బుల్లయ్య పార్టీని స్థాపించిన నాటినుండి ఎన్టీఆర్ అభిమానిగా పలు కార్యక్రమాలు చేపడతున్న మంచినాయకుడని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో
ఉప సర్పంచ్ వీరా రవి,
ఆకెళ్ళ సూరిబాబు, కత్తుల బాలస్వామి, ఎన్ ఎస్ ఎన్ వర్మ, బొట్టు బంగారం, జొన్నాడు శ్రీను గుండా బత్తుల భాస్కరరావు, నెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి, తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్ నాయకుల ఘన నివాళి

- కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో ఘనంగా స్వర్గీయ ఎన్టీఆర్ 30వ వర్ధంతి



**కాకినాడ, పెన్ పవర్,జనవరి 18 :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌములు, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30వ వర్ధంతి సందర్భంగా, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,“తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్. పేదవాడి ఆకలి తీర్చేందుకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా గృహాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సంక్షేమ రారాజుగా నిలిచారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారాన్ని అందించిన సామాజిక సంస్కర్త ఎన్టీఆర్. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి” అని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ,జిల్లా పరిషత్ సెంటర్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి ఏసుదాసు, మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, తుమ్మల రమేష్, గ్రంధి బాబ్జీ, పంతాడి రాజు, పలివెల రవి, ఎం.డి. ఖాన్, రహీం, మెంటారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, నూరుకుర్తి వెంకటేశ్వరరావు,దేవు వెంకన్న, బత్తుల సత్యనారాయణ, చింతలపూడి రవి తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు

* తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



**కాజులూరు, పెన్ పవర్, జనవరి 18 :**తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా నాయకుడు,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, నటసార్వ భౌముడు స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వర్ధంతిని కాజులూరు మండల పరిధిలోని తణుకువాడ, గొల్లపాలెం,శీల,మంజేరు, ఆర్యవటం తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

గొల్లపాలెం గ్రామంలో జరిగిన ప్రధాన కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి మరియు గొల్లపాలెం సొసైటీ అధ్యక్షులు అంగర కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,"పేదల జీవితాల్లో వెలుగు నింపిన మహానాయకుడు ఎన్టీఆర్. రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా గృహాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో పేదవాడి ఆకలి తీర్చిన గొప్ప నాయకుడు ఆయన. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశమంతటా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్" అని కొనియాడారు. చుండ్రు వీర్రాజు చౌదరి మాట్లాడుతూ,"ఎన్టీఆర్ అటు సినిమా రంగంలో, ఇటు రాజకీయ రంగంలో అద్భుతంగా రాణించారు. తెలుగు జాతి గర్వించేలా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి మాచారెడ్డి (టీఎంఆర్),అంగర శ్రీను, నల్లం నాగేశ్వరరావు,నక్క శ్రీను (గ్రామ కమిటీ అధ్యక్షులు),కోక హరిబాబు, పిల్లారి శెట్టి రాంబాబు,కురుపూడి దొరబాబు,మాధవరపు శ్రీరామ్మూర్తి, కట్టా శీను, వనమాడి శీను, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున నాగేశ్వరి, పుణ్య మంతుల రామకృష్ణ, ఎంపీటీసీ గండి మణికంఠ,శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ,రెడ్డి శేషారావు, తణుకువాడ సొసైటీ అధ్యక్షులు పితాని సతీష్ కుమార్,వల్లు అర్జునరావు,పితాని సూరసేనుడు,సలాది సాయిబాబుతో పాటు పలువురు కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు పిలుపునిచ్చారు.

## చెయ్యేరు లో ఘనంగా ఎన్టీఆర్ 30 వ వర్ధంతి వేడుకలు



**కాట్రేనికోన పెన్ పవర్ జనవరి 18:**కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి సినీనటుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా చెయ్యేరు అగ్రహారంలో ఆయన విగ్రహానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కారణజన్ముడని అన్నారు. అటు సినీ రంగంలో గానీ ఇటు రాజకీయ రంగంలో గానీ ఆయన ఎన్నో సంచలనాలు సృష్టించారని పేర్కొన్నారు.

అనంతరం వృద్ధులకు దుప్పట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెల్లి వివేకానంద,నడింపల్లి సుబ్బరాజు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, డి సి చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ , త్సవట పల్లి నాగేంద్ర, సర్పంచ్ చెల్లి సురేష్, స్టేట్ ఆక్వా డైరెక్టర్ విత్తనాల బుజ్జి, ఎస్సీ సెల్ బడుగు పుల్లారావు, ఇసుక పట్ల కొండ, బండారు ఏసు, వాసంశెట్టి రాజేశ్వరరావు, మెల్లం సువర్ణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, జనవరి 18:**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో అంపసయ్యపై ఉన్న సమాజాన్ని మేల్కొలిపిన దార్శనికుడు, పేద బడుగు,బలహీన వర్గాలకు కూడు, గూడు, గుడ్డ అనే నినాధంతో తెలుగు ప్రభను ప్రపంచదేశాలకు విస్తరింపచేసిన నట సార్వ బౌముడు పద్మశ్రీ డా!!నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహానేతకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్బంగా సందర్బంగా జరిగన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గందం పల్లంరాజు వృద్దులకు, వికలాంగులకు, వితంతువులకు దప్పట్లు పంపిణీ చేసారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అల్లవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అధికారపు జయ వెంకటలక్ష్మి, జిల్లా తెలుగుమహిళ అద్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, అమలాపురం పురపాలక సంఘ మాజీ ఛైర్మన్ చిక్కాల గణష్, అమలాపురం రూరల్ మండల మాజీ జడ్పీటిసి చింతా శంకరమూర్తి అధిక సంఖ్యలో కూటమి నేతలు కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# అన్న ఎన్టీఆర్ స్ఫూర్తి తెలుగువారి గుండెల్లో సజీవం



ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ పెన్ పవర్, జనవరి 18:**తెలుగువారి ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి స్ఫూర్తి ఎల్లప్పుడూ తెలుగువారి గుండెల్లో సజీవంగా ఉంటుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ గారి 30వ వర్ధంతి సందర్భంగా శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శాంతినగర్ సీకోటి అప్పలకొండ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు, శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ చేతుల మీదుగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లోని శ్రీ నందమూరి బసవతారకం రామారావు బస్ షెల్టర్ వద్ద పేదలకు అన్నసంతర్పణ కార్యక్రమంనిర్వహించారు. దుమ్ములపేట, పరలోవపేట, ప్రెజర్ పేట, పేర్రాజుపేట, జగన్నాథపురం బవునారాయణ సెంటర్, జే.రామారావు పేట, కొత్తపేట కామేశ్వరి నగర్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ,

"తెలుగు జాతి ముద్దుబిడ్డ అన్న ఎన్టీఆర్. అటు సినిమా రంగాన్ని, ఇటు రాజకీయ రంగాన్ని ఏలిన యుగపురుషుడు. ఆయన ముందుచూపుతో ప్రవేశపెట్టిన పథకాలే ఈరోజు పేదవాడికి శ్రీరామరక్షగా నిలిచాయి. తెలుగువాడి ఆత్మగౌరవాన్ని కాపాడి, తెలుగు జాతి ఖ్యాతిని దేశమంతటా చాటిచెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకంతో పేదవాడి ఆకలిని తీర్చిన గొప్ప వ్యక్తి ఆయన" అని కొనియాడారు. శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ,"ప్రతి పేదవాడికి కూడూ, నీడ, గుడ్డా అందాలనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్ గారికే దక్కుతుంది. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గ్రంధి నారాయణరావు, వాసిరెడ్డి ఏసుదాసు, బూరిగ ఆశీర్వాదం, సీకోటి అప్పలకొండ, గదుల సాయిబాబా, బచ్చు శేఖర్, పంతాడి రాజు, ఎం.ఏ. తాజుద్దీన్, తుమ్మల రమేష్, ఎం.డి అన్సర్, పలివెల రవి, అనంత కుమార్, ఒమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ, గడ్డం పూర్ణ చంద్రశేఖర్, ఎం.డి ఖాన్, నల్లూరి శ్రీనివాస్, ఎస్.కే రహీమ్, ఏవీడీ మెంటారావు, గుత్తుల రమణ, గోపిశెట్టి భూరయ్య, ఎన్టీఆర్ అశ్రీఫ్ ఆలీ, చింతలపూడి రవి, పొంగా బుజ్జి, పలివెల లక్ష్మి, బత్తుల భవాని, కోడూరు పెద్ద, అమల కంటి బలరాం, రెడ్డనం సత్తిబాబు, మల్లాడి గంగాధరం, పాలిక నాని, గుమ్మల్ల చిన్నా, పులుపుకూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నివాళులర్పించిన జాస్తి వసంత్



**గండేపల్లి , పెన్ పవర్, జనవరి ,18:**గండేపల్లి మండలం మురారి గ్రామంలో గండేపల్లి మండలంలో క్లస్టర్ ఇన్చార్జి జాస్తి వసంత్ ఆధ్వర్యంలో 30వ స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిని ఘనంగా ఏర్పాటు చేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు అజరామర వ్యక్తి అని ఆయన పేదలకు సంతోషంగా ఉండాలని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ధన సీనియర్ టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పేదల ఆకలి తీర్చిన నాయకుడి 30వ వర్ధంతి ఘనంగా

### మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో





**కూనవరం,పెన్ పవర్,జనవరి 18.**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని తెదేపా మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు అధ్యక్షతన మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల వారి కోసం పార్టీని స్థాపించి,గెలిపించి సంక్షేమ ఫలాలకు నాంది పలికి దేశంలో ఎక్కడ లేనటువంటి రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని అమలుచేసి పేద ప్రజల ఆకలని దూరం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదవాడి గుండెల్లో కొలువయ్యాడని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉన్న రోగులకు పండ్లు,పాలు,రొట్టెలు అందించారు. ఈ కార్యక్రమంలో చెలికాని ఉమా, ఇంటి భాస్కరరావు,మోసం రాము, తోటకూరి వెంకటేశ్వరరావు, నోముల సత్యనారాయణ,గడ్డిపాటి ప్రసాద్,గడేసుల ప్రేమ్ చంద్,సోమక సత్యనారాయణ,కారం రత్తయ్య, ఆదినారాయణ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాలుగు తరాల వారసుల ఆత్మీయ సమ్మేళనం

### నారాయణపురంలో కుటుంబసభ్యుల సంక్రాంతి సంబరాలు



**పెన్ పవర్, ఉంగుటూరు, జనవరి 18:**సంక్రాంతి పండుగ సందర్భంగా నారాయణపురంలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారసులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. స్వర్గీయ ఎదురువలస దాలయ్య రత్నాలు కుటుంబానికి చెందిన కొడుకులు, కూతుళ్లు, మనుమలు, మునిమనుమలు కలిపి దాదాపు 46 మంది కుటుంబసభ్యులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు.

ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబసభ్యులంతా పండుగ వేళ స్వగ్రామం నారాయణపురానికి చేరుకుని పరస్పర యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆప్యాయంగా కలిసి సంక్రాంతి విందు భోజనాన్ని ఆస్వాదించారు.

ఒకేసారి నాలుగు తరాల వారసులు ఒకే చోట కలవడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది నిజమైన సంక్రాంతి సంబరాలుగా భావిస్తున్నామని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సమావేశం కుటుంబ బంధాల ప్రాధాన్యతను మరింత గుర్తుచేసిందని పలువురు అన్నారు.

## నందమూరి వర్ధంతి సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 18** తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా రాజమండ్రి ప్రభుత్వ హాస్పిటల్ వద్ద సిటీ ఎమ్మెల్యే యువ నాయకులు ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పేషెంట్లకు పండ్లు, బెడ్స్ పంచి పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ, కుడు,గుడ్డ, నీడ అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ స్థాపించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కురుపుదు సత్తిబాబు మాట్లాడుతూ, బీసీలకు స్థానికంగా రిజర్వేషన్ తీసుకొచ్చి బీసీల రాజకీయ ఎదుగుదలకు కారణమ న్నారు. స్థానిక రిజర్వేషన్లు 24 శాతం తీసుకొచ్చి నందుకు బీసీల ఆరాధ్యదైవం నందమూరి తారకరామారావు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగరాధ్యక్షులు మజ్జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక ఎన్టీఆర్



**పెద్దాపురం, పెన్ పవర్, జనవరి 18:** తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా జాతీయ రాజకీయాలకు సరికొత్త దిశా నిర్దేశం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని పలువురు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగు భాష, సినిమా, కళలు, రాజకీయాలు, సాహిత్య రంగాల వికాసానికి ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని, ఆయన ఆశయసాధన కోసం కృషి చేయాలని అన్నారు. నటుడిగా, ప్రజా నాయకుడిగా ప్రజాహిత పాలనకు, సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా చరిత్ర సృష్టించడంతో పాటు జాతీయ రాజకీయాలకు సరికొత్త దిశా నిర్దేశం చేశారని తెలిపారు. రాజకీయాల్లో మహిళలు, బడుగు వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు, అట్టడుగు వర్గాలకు సంక్షేమాన్ని అందించేందుకు మహిళలకు ఆస్తి హక్కు, బీసీలకు రిజర్వేషన్లు, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలతో సమసమాజ స్థాపనకు బాటలు వేసిన ఎన్టీఆర్ ఆశయ సాధనకు మనందరం కృషి చేద్దామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిది శ్రీనివాస్, దిబ్బడి రాజబాబు, గుత్తుల సూర్యావతి, గుత్తుల శ్రీనివాస్, అడపా గంగాధర్, బొడ్డు బాబూరావు, ఎన్. రాంబాబు, బిక్కిన సూరిబాబు, చేవ సీతారామరాజు, శలపాక చంద్రశేఖర్, ప్రగడ దొరబాబు, కాకర్ల సూర్య భాస్కరరావు, నలమాటి సూర్య భాస్కరరావు, ఏలేటి శ్రీనివాస్, వై. రాంబాబు, మాదిరెడ్డి సూరిబాబు, మార్ని మోహనరావు, యడ్లపల్లి తమ్మారావు, సానిపిన శ్రీనివాస్, దాసరి నల్లబాబు, కొట్టేటి వీరన్న, సాధువుల సింగారం, పెంట శ్రీనివాస్, కూరాకుల జగదీష్, అల్లు రాజబాబు, అధిక సంఖ్యలో అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా చండీ హోమం



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 18;**చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ హోమాన్ని పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ హోమానికి చుట్టు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తజనం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డ్ చైర్మన్ వీరి అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రాత్రి భోజనం ఆలస్యంగా తీసుకుంటే..
# డయాబెటిస్ వస్తుందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** చాలా మంది రాత్రి వేళ ఆలస్యంగా భోజనం తీసుకోవడాన్ని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలి ఆరోగ్యంలో అనేక మార్పులకు దారితీసింది. పని, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం,మారుతున్న జీవనశైలి కారణంగా ఆహారపు అలవాట్లు చెదిరిపోతున్నాయి. అందువల్ల చాలామంది ఆలస్యంగా తినడం అలవాటు చేసుకున్నారు. దానిని సాధారణ అలవాటుగా భావిస్తారు. కానీ ప్రభావం వెంటనే గుర్తించబడకపోయినా అది క్రమంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తినడం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి రాత్రి ఆలస్యంగా తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయా? రాత్రిపూట ఆలస్యంగా తినడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మధ్య బలమైన సంబంధం ఉందని నిపుణులు చెబుతారు. భోజన సమయం చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుందని అనేక అధ్యయనాలు సైతం నిరూపించాయి. అందుకే ఈ అలవాటు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి ప్రకారం.. ఒక వ్యక్తి ఆలస్యంగా భోజనం చేసినప్పుడు, శరీరం దానిని ప్రాసెస్ చేయడం కష్టమవుతుంది. పగటిపూట కంటే రాత్రిపూట శరీరం నెమ్మదిగా పనిచేస్తుంది. అలాంటి సందర్భంలో తినే ఆహారం వెంటనే శక్తిగా మారదు. అందువల్ల, రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరగవచ్చు. ముఖ్యంగా తీపిగా ఉండే భోజనం తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అధిక చక్కెర స్థాయిలు కేవలం



మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రమే సమస్య కాదు. ఆరోగ్యకరమైన వ్యక్తికి కూడా, రాత్రి ఆలస్యంగా తినే అలవాటు భవిష్యత్తులో సమస్యలకు దారితీస్తుంది. ఎక్కువ రోజులు ఈ అలవాటు కొనసాగించడం వల్ల శరీర చక్కెర నియంత్రణ వ్యవస్థ బలహీనపడుతుంది. క్రమంగా, ఇది ఇన్సులిన్‌ను ప్రభావితం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి సాధారణం కంటే ఎక్కువగా పెరగడం ప్రారంభమవుతుంది. ఈ అలవాటు మధుమేహం క్రమంగా ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సకాలంలో సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# బట్టల్లో యూరిన్ పడిపోతుందా!



**హైదరాబాద్ పెన్ పవర్:** మూత్ర ఆపుకొనలేని స్థితి అనేది చాలా మందిని వేధించే సమస్య. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్, ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ వంటి వివిధ రకాలు ఉన్నాయి. డయాబెటిస్, మెనోపాజ్, బలహీనమైన కండరాలు వంటివి ప్రధాన కారణాలు. సరైన నిర్ధారణ, చికిత్సల ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చు. మూత్ర ఆపుకొనలేని స్థితి (యూరినరీ ఇంకంటినెన్స్) అనేది చాలా మంది వృద్ధులను, ముఖ్యంగా మహిళలను, వేధించే ఒక సాధారణ ఆరోగ్య సమస్య. దీని వల్ల వ్యక్తిగత జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుంది, సామాజిక కార్యకలాపాలకు దూరం కావాల్సి రావచ్చు. యూరిన్ లీకేజ్, దుర్వాసన, మూత్రం రంగులో మార్పు వంటి లక్షణాలతో బాధపడుతున్న ఒక 50 ఏళ్ల వ్యక్తి ప్రశ్నకు సమాధానంగా, వైద్యులు ఈ సమస్య గురించి కారణాలు, చికిత్సా పద్ధతులను వివరించారు.మూత్రం ఆపుకొనలేని స్థితి ప్రధాన రకాలు: 1. ఓవర్‌యాక్టివ్ బ్లాడర్: ఈ స్థితిలో బ్లాడర్ పరిమాణం చిన్నదై, తరచుగా మూత్ర విసర్జన చేయాలనే బలమైన కోరిక కలుగుతుంది. బ్లాడర్‌కు వెళ్లే లోపల కూడా మూత్రం లీక్ కావచ్చు. దీర్ఘకాలిక మధుమేహం (5-6 సంవత్సరాలకు పైగా) ఉన్నవారిలో బ్లాడర్ కండరాలు ప్రభావితమై ఈ సమస్య రావొచ్చు. అలాగే, పోస్ట్ మెనోపాజల్ తర్వాత హార్మోన్ల మార్పుల వల్ల బ్లాడర్ కండరాలు బలహీనపడి, ఇరిటబిలిటీ పెరిగి, బ్లాడర్ సామర్థ్యం తగ్గిపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల తరచుగా, హఠాత్తుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. 2. స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్: దగ్గినా, తుమ్మినా, నవ్వినా, లేదా ఏదైనా శారీరక శ్రమ చేసినా మూత్రం లీక్ అవ్వడం దీని లక్షణం. హార్మోన్ల క్షీణత, వయసు పెరగడం, లేదా ప్రసవాల కారణంగా గర్భసంచి చుట్టూ ఉన్న పెల్విక్ కండరాలు (పెల్విక్ ఫ్లోర్ మజిల్స్) బలహీనపడటం వల్ల ఇది సంభవిస్తుంది. కడుపుపై ఒత్తిడి పెరిగినప్పుడు ఈ బలహీన కండరాలు మూత్రాశయాన్ని సరిగా నిలువరించలేవు. 3. మిశ్రమ ఇంకంటినెన్స్: ఇది ఓవర్‌యాక్టివ్ బ్లాడర్, స్ట్రెస్ యూరినరీ ఇంకంటినెన్స్ లక్షణాల కలయిక. అంటే, దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవ్వడం, అలాగే మూత్రం వచ్చినప్పుడు ఆపుకోలేకపోవడం వంటి రెండు సమస్యలు ఒకేసారి ఉండవచ్చు.

4. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్: ఈ రకంలో, బ్లాడర్ సరిగ్గా ఖాళీ అవ్వదు. దీనివల్ల మూత్రాశయం నిండిపోయి, మూత్రం నిరంతరం చుక్కలు చుక్కలుగా లీక్ అవుతుంది. దీర్ఘకాలిక మధుమేహం ఉన్నవారిలో బ్లాడర్ పంపింగ్ సామర్థ్యం తగ్గిపోవడం, మూత్రం మిగిలిపోవడం వల్ల బ్లాడర్ పూర్తి అయ్యే సంవేదన తెలియక, అది నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతుంది.ఓవర్‌యాక్టివ్ బ్లాడర్ నిర్ధారణ: యూరోడైనమిక్ స్టడీ అనే పరీక్ష ద్వారా బ్లాడర్ ప్రెషర్‌లను, లీకేజ్ ఎప్పుడు జరుగుతుందో అంచనా వేస్తారు. దీనిలో బ్లాడర్‌లోకి చిన్న ట్యూబ్ ద్వారా నీటిని పంపి పరిశీలిస్తారు. ఓవర్‌ఫ్లో ఇంకంటినెన్స్ చికిత్స: కొన్ని రోజులు యూరిన్ పైపు (కేథెటర్) అమర్చడం, ఆపై సిఐసి (క్లీన్ ఇంటర్‌మిటెంట్ కేథెటరైజేషన్) అంటే ప్రతి నాలుగు గంటలకు ఒకసారి పైపును స్వయంగా పెట్టుకుని తీయడం వంటి శిక్షణ ఇస్తారు. బ్లాడర్ పంపింగ్‌ను మెరుగుపరచడానికి మందులు కూడా ఇస్తారు. ఈ పద్ధతుల ద్వారా లీకేజ్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. స్ట్రెస్ ఇంకంటినెన్స్ చికిత్స: కీగెల్ ఎక్సర్‌సైజులు (పెల్విక్ ఫ్లోర్ ఎక్సర్‌సైజులు) కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు ఈ వ్యాయామాలు సరిగా స్పందించకపోవచ్చు లేదా లీకేజ్ ఎక్కువగా ఉన్నప్పుడు "స్లింగ్ సర్జరీలు" అనే శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు. ఈ ఆపరేషన్ల ద్వారా మూత్రం లీకేజ్‌ను పూర్తిగా నివారించవచ్చు. ఈ సమస్యతో బాధపడేవారు తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించి, సరైన నిర్ధారణ, చికిత్స పొందడం ద్వారా సాధారణ జీవితాన్ని గడపవచ్చు.

# స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా..?

**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. నేటి ప్రపంచంలో, గుండె జబ్బులు, దాని చికిత్స గురించి ఇంటర్నెట్‌లో చాలా సమాచారం అందుబాటులో ఉంది. దీంతో రోగులు, వారి కుటుంబాలు తరచుగా గందరగోళానికి గురవుతారు. ముఖ్యంగా కార్డియాక్ స్టెంట్లకు సంబంధించి, ప్రశ్న పదేపదే తలెత్తుతుంది. స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వస్తుందా? స్టెంట్ వేసిన తర్వాత కూడా గుండెపోటు వచ్చే అవకాశం పూర్తిగా తొలగించినట్లు కాదని వైద్యులు స్పష్టంగా చెబుతున్నారు. గుండెకు రక్తాన్ని తీసుకువెళ్ళే ధమనులలో కొలెస్ట్రాల్ నిక్షేపాలు దారిని ఇరుకుగా చేసినప్పుడు స్టెంట్ అమరుస్తారు. ఇది సాధారణ రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి, మూసుకుపోయిన సిరలోకి చొప్పించబడే లోహపు మెష్. గుండెపోటు తర్వాత లేదా తీవ్రమైన అడ్డంకులు ఉన్న సందర్భాల్లో సిరను తెరిచి ఉంచడానికి సహాయపడుతుంది. గుండెకు తగినంత రక్త ప్రసరణను నిర్ధారించడానికి సాధారణంగా స్టెంట్ అమరుస్తారు.

స్టెంట్ ఒక నిర్దిష్ట సిరను తెరుస్తుంది. కానీ అది గుండెలోని అన్ని ధమనులను రక్షించదు. రోగి అనారోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తే, వేయించిన, అధిక కొవ్వు పదార్థాలు తింటే, ధూమపానం చేస్తే లేదా శారీరకంగా క్రియారహితంగా ఉంటే, ఇతర గుండె ధమనులలో అడ్డంకులు ఏర్పడవచ్చు. అందుకే స్టెంట్ వేసినప్పటికీ మళ్ళీ గుండెపోటు రావచ్చు. స్టెంట్ సహజ సిరకు ప్రత్యామ్నాయం కాదు. ఆ సమయంలో ప్రాణాలను కాపాడటానికి



సహాయపడే తాత్కాలిక మద్దతు మాత్రమే. శరీరంలోకి పదేపదే స్టెంట్లను చొప్పించడం సురక్షితమైనదిగా.. శాశ్వత పరిష్కారంగా పరిగణించదంటున్నారు వైద్య నిపుణులు. మళ్ళీ గుండెపోటు వస్తే, రోగి పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చంటున్నారు. చికిత్స కూడా కష్టతరం కావచ్చు అని కార్డియాలజిస్ట్ వైద్య నిపుణులు వివరిస్తున్నారు. స్టెంట్ అమర్చిన తర్వాత, రోగి మునుపటి కంటే ఎక్కువగా దుర్బలంగా ఉంటాడు. రెండవ గుండెపోటుతో ప్రమాద తీవ్ర పెరుగుతుంది. చాలా సందర్భాలలో, యాంజియోప్లాస్టీ , స్టెంట్ చొప్పించడం అవసరం రావచ్చు. కొన్ని సందర్భాల్లో, శరీరం స్టెంట్‌ను అంగీకరించకపోతే, ప్రక్రియ సమయంలో ఏదైనా సమస్య ఉంటే, పరిస్థితి ప్రాణాంతకం కూడా కావచ్చు. అందుకే స్టెంట్ అమర్చిన తర్వాత నిర్లక్ష్యంగా ఉండకూడదని వైద్యులు పదేపదే హెచ్చరిస్తున్నారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన సమయంలో వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. ధూమపానం మానేయడం, ఒత్తిడిని నియంత్రించడం అనేవి స్టెంట్ తర్వాత గుండెను రక్షించుకోవడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలు. స్టెంట్ అనేది చికిత్సలో ఒక భాగం, మొత్తం చికిత్స కాదు. నిజమైన చికిత్స జీవనశైలి మార్పుల నుండి వస్తుందంటున్నారు వైద్య నిపుణులు.

## టమాటాలు ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే..
## రోగాలు కొని తెచ్చుకున్నట్లే!



**హైదరాబాద్ పెన్ పవర్:** చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం. టమోటాలు లేకుండా వంట చేయడం ఎవరికీ సాధ్యం కాదు. చట్నీ నుంచి సాంబార్ వరకు ప్రతి వంటకానికి టమోటాలు అవసరం. అందుకే మనం మార్కెట్ నుంచి కాస్త ఎక్కువ మొత్తంలో టమోటాలు కొని నేరుగా ఫ్రిజ్‌లో ఉంచుతాం. ఈ విధంగా రిఫ్రిజిరేటర్‌లో టమోటాలు నిల్వ చేయడం వల్ల వాటి రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హానికరం అని నిపుణులు హెచ్చరించారు.బాగా పండిన టమోటాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వాటిని ఐదు రోజుల కంటే ఎక్కువ నిల్వ చేయకూడదట. అతి శీతల ఉష్ణోగ్రతలు టమోటాలలో కణ నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి. దీనివల్ల వాటి నాణ్యత తగ్గుతుంది. కాబట్టి మీరు వాటిని రెండు లేదా మూడు రోజుల్లో ఉపయోగించుకుంటే మంచిది. ఫ్రిజ్‌లో ఉంచవచ్చు లేదంటే వాటిని బయట గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిది. ఈ విధంగా మీరు టమోటాల పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. సాధారణంగా టమోటాలను ఒక వారం కంటే ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచితే, అవి బయటి వైపు బాగా కనిపించవచ్చు కానీ లోపల కుళ్ళిపోవడం ప్రారంభించవచ్చు. వంటలో ఇటువంటి టమోటాలను ఉపయోగించడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. రిఫ్రిజిరేటర్‌లో అధిక తేమ వల్ల టమోటాలు మనకు తెలియకుండానే చెడిపోతాయి. ఇటువంటి టమోటాలు తినడం వల్ల అనారోగ్యం, వాంతులు, విరేచనాలు వస్తాయి. రోగనిరోధక శక్తి బలహీనపడటం, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మీరు టమోటాలను తాజాగా ఉంచుకోవాలనుకుంటే వాటిని కొన్న వెంటనే కొన్ని రోజుల్లోనే ఉపయోగించడానికి ప్రయత్నించండి. ఫ్రిజ్‌లో నిల్వ చేసినప్పటికీ కూరగాయల కోసం కేటాయించిన డ్రాయర్‌లో ఉంచండి. టమాట లోపల నల్లటి మచ్చలు, దుర్వాసన ఉన్న టమోటాలను ఉపయోగించవద్దు.

## అరటి పండ్లు ఈ టైంలో తింటే ఎన్నో లాభాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు.ఏడాది పొడవునా లభించే పండ్లలో అరటిపండు ఒకటి. అరటిపండ్లను పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తింటారు. అయితే అరటిపండ్లను ఎల్లప్పుడు సరైన పద్ధతిలోనే తినాలి. తద్వారా వీటిల్లోని పోషకాలను పూర్తిగా పొందొచ్చు. ఉదయం నిద్రలేచిన తర్వాత అరటిపండ్లు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ బి6, పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మలబద్ధకంతో బాధపడేవారికి ఉదయం అరటిపండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జిమ్‌కు వెళ్లే ముందు లేదా వ్యాయామం చేసే ముందు 1 లేదా 2 అరటిపండ్లు తినడం మంచిది. అరటిపండ్లలోని కార్బోహైడ్రేట్లు వ్యాయామానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. అలాగే పొటాషియం కండరాల తిమ్మిరిని నివారిస్తుంది. ఇది కండరాలను కూడా బలపరుస్తుంది. భోజనం తర్వాత అరటిపండ్లు తినడం వల్ల జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అరటిపండ్లలోని ఫైబర్ ఆహారం జీర్ణం కావడానికి దోహదపడుతుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడంలో కూడా సహాయపడుతుంది. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆకలిగా అనిపించినప్పుడు జంక్ ఫుడ్ కు బదులుగా అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది స్నాక్స్ తినే అలవాటును వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇది శరీరానికి అవసరమైన పోషణను కూడా అందిస్తుంది.

## టెక్నాలజీ : వాయిస్ ట్రాన్స్లేషన్తో ఒరిజినల్ వీడియోలా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇన్‌స్టాగ్రామ్‌లో మరో కొత్త ఫీచర్ వచ్చేసింది. క్రియేటర్లకు ఈ ఫీచర్ చాలా బాగా ఉపయోగపడనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని వాడి రీల్స్ కంటెంట్‌ను ప్రాంతీయ భాషల్లోకి ట్రాన్స్‌లేట్ చేసకునేందుకు 'వాయిస్ ట్రాన్స్‌లేషన్ణ ఫీచర్‌ను తీసుకొచ్చింది. దీంతోపాటు 'లిప్ సింక్' టూల్ కూడా ఉంది. ఇప్పటివరకు కేవలం ఇంగ్లిష్, హిందీ వంటి భాషలకు మాత్రమే పరిమితమైన ఈ టెక్నాలజీ తెలుగు, తమిళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.అయితే, వీడియో కంటెంట్ ట్రాన్స్‌లేషన్?లా కాకుండా చాలా నేచురల్‌గా ఉంటుంది. పైగా రోబోటిక్ వాయిస్‌లా ఉండకుండా అచ్చం ఒరిజినల్‌లా అనిపిస్తుంది. గొంతులోని పిచ్, స్టైల్, ఎమోషన్స్‌కు తగ్గట్టు పసిగట్టి అలానే అనువదిస్తుంది. దీనికి లిప్ సింక్ ఫీచర్ కూడా తోడవ్వడంతో మాట్లాడే వ్యక్తి పెదవుల కదలికలను బట్టి ఏఐ ఆటోమేటిక్‌గా అనలైజ్ చేసి, ట్రాన్స్‌లేట్ చేసేటప్పుడు దానికనుగుణంగా కదలికలను మారుస్తుంది. కాబట్టి కంటెంట్‌ను ఏ భాషలో చూసినా ఒరిజినల్ వాయిస్‌లానే అనిపిస్తుంది. వాయిస్ మాత్రమే కాదు, వీడియో ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో కూడా దేవనాగరి, బెంగాలీ, అస్సామీ స్క్రిప్ట్‌లలో కొత్త ఫాంట్‌లను తీసుకురావడం ద్వారా క్రియేటర్లు తమ వీడియోలకు వాళ్ల భాషలో క్యాప్షన్లు రాసుకోవచ్చు.

**లిమిట్స్ క్రాస్ చేయకుండా..**

సోషల్ మీడియాలో ఎక్కువసేపు టైం స్పెండ్ చేయడం కూడా మంచిది కాదని పిల్లల కోసం ఆల్రెడీ కొన్ని రూల్స్, రెగ్యులేషన్స్?ను తీసుకొచ్చింది యూట్యూబ్. పిల్లలను ఎక్కువసేపు సోషల్ మీడియాలో ఉండనివ్వకుండా, వాళ్ల యాక్టివిటీలు, చదువును ఎంకరేజ్ చేసేలా పేరెంటల్ కంట్రోల్? అనే ఫీచర్? తీసుకొచ్చింది. దీంతోపాటు ఇప్పుడు మరో అప్?డేట్?ను పంచుకుంది. అదేంటంటే.. పిల్లలు యూట్యూబ్ షార్ట్స్‌ను ఎంతసేపు చూడాలో టైం లిమిట్ పెట్టొచ్చు. అంతేకాదు, త్వరలోనే షార్ట్స్ ఫీడ్‌ను పూర్తిగా జీరోకి సెట్ చేసే చాన్స్ కూడా ఉందట. అవసరాన్ని బట్టి ఒకరోజు కంప్లీట్ షార్ట్స్‌ను ఆపేయడం లేదా ఎంటర్‌టైన్‌మెంట్ కోసం 60 నిమిషాల వరకు లిమిట్ పెట్టొచ్చు.

15 నిమిషాలు, అరగంట, 45 నిమిషాలు, గంట లేదా రెండు గంటలుగా షార్ట్స్? టైమ్?ని సెట్? చేసుకోవచ్చు. సూపర్‌వైజ్డ్ యూట్యూబ్ అకౌంట్‌లలో బెడ్ టైం, 'టేక్ ఎ బ్రేక్ణ రిమైండర్లను కూడా కస్టమైజ్ చేసుకోవచ్చు. దీంతోపాటు టీనేజర్లకు ఉపయోగపడేలా కంటెంట్?ను అందించడమే లక్ష్యంగా కొత్తగా క్రియేటర్ గైడ్‌ను తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఖాన్ అకాడమీ, క్రాష్ కోర్స్, టెడ్-ఎడ్ లాంటి ఎడ్యుకేషనల్ వీడియోలను టీనేజర్లకు ఎక్కువగా సూచించనుంది. వీటిని యూత్ అడ్వైజరీ కమిటీ, యూసీఎల్?ఏకి చెందిన సెంటర్ ఫర్ స్కాలర్స్ అండ్ స్టోరీటెల్లర్స్‌తో కలిసి డిజైన్? చేసినట్టు తెలిపింది. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్, బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్స్?కు చెందిన డిజిటల్ వెల్‌నెస్ ల్యాబ్‌తోపాటు అంతర్జాతీయ సంస్థల ఎక్స్‌పర్ట్స్ దీనికి సపోర్ట్ ఇచ్చారు. రాబోయే రోజుల్లో అప్‌డేటెడ్ సైన్ అప్ విధానంతో టీనేజర్లకు ఆటోమేటిక్?గా అండర్-18 ప్రొటెక్టెడ్ అకౌంట్‌లలోకి తీసుకొచ్చేలా యాప్?లోనే వెసులుబాటు కల్పించింది.

# సుందర్ స్థానంలో ఆల్ రౌండర్ కాకుండా స్పిన్నర్‌కు ఛాన్స్ ..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. సెలెక్టర్లు అతని స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను జట్టులోకి తీసుకున్నారు. వడోదరలో కివీస్‌తో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేస్తున్నప్పుడు సుందర్ పక్కటెముకల కండరాల గాయానికి గురయ్యాడు. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించగా.. అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్తాడని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా శుక్రవారం ప్రకటించారు. అయితే సుందర్ స్థానంలో ఇప్పుడు స్పెషలిస్ట్ స్పిన్నర్ ను ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారుతోంది.

స్వదేశంలో వరల్డ్ కప్ జరగడంతో టీమిండియాకు స్పిన్ ఆల్ రౌండర్ కంటే స్పెషలిస్ట్ స్పిన్నర్ అవసరం ఎక్కువగా ఉంది. పైగా సుందర్ ను రీప్లేస్ చేసే స్పిన్ ఆల్ రౌండట జట్టులో లేడు. కృనాల్ పాండ్య అంతర్జాతీయర్ క్రికెట్ ఆడి నాలుగు సంవత్సరాలు దాటింది. నేరుగా వరల్డ్ కప్ కు తీసుకొని వచ్చి ఆడించడం రిస్క్ అవుతోంది. మరోవైపు రియాన్ పరాగ్ రూపంలో స్పిన్ ఆప్షన్ ఉన్నప్పటికీ ఈ యువ క్రికెటర్ పూర్తి ఫిట్ నెస్ తో లేదని తెలుస్తోంది. ఈ సంగతి పక్కన పెడితే వరల్డ్ కప్ స్క్వాడ్ లో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి రూపంలో ఇద్దరు స్పిన్నర్లు మాత్రమే ఉన్నారు. స్వదేశంలో స్పిన్ ట్రాక్స్ ఉండడంతో సెలక్టర్లు బిష్ణోయ్ వైపే మొగ్గు చూపారు.

**తొలి వన్డే ఆడుతూ సుందర్ కు గాయం:**

ఆదివారం (జనవరి 11) వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో సుందర్ బౌలింగ్ చేస్తూ అసౌకర్యానికి గురయ్యాడు. 5 ఓవర్లు బౌలింగ్ చేసి 27 పరుగులు ఇచ్చి మ్యాచ్ మధ్యలోనే వైదొలిగాడు. ఆ తర్వాత బ్యాటింగ్ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు 8వ స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చాడు. మ్యాచ్ తర్వాత సుందర్ కు ఎడమ పక్కటెముకలు

గాయం అయినట్టు తేలింది. సుందర్ కు సైడ్ స్ట్రెయిన్ ఉందని మ్యాచ్ తర్వాత స్కాన్ కోసం వెళ్తాడని మ్యాచ్ తర్వాత కెప్టెన్ గిల్ తెలిపాడు. ఈ టూర్ లో టీమిండియా ప్లేయర్లకు గాయాల బెడద కొనసాగుతూనే ఉంది. తొలి వన్డేకు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడి సిరీస్ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. అంతకముందు తెలుగు కుర్రాడు తిలక్ వర్మ గజ్జల్లో గాయం కారణంగా కివీస్ తో జరగబోయే తొలి మూడు టీ20లకు దూరమయ్యాడు.

# RCB పట్టిందల్లా బంగారమే.. టీమిండియా యంగ్ ప్లేయర్ మ్యాచ్ విన్నింగ్ స్పెల్







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మరింత పటిష్టంగా మారనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ ఐపీఎల్ 2026 మెగా ఆక్షన్ లో కొనుగోలు చేసిన ఇండియన్ యంగ్ ప్లేయర్ ప్రస్తుతం జరుగుతున్న అండర్-19 వరల్డ్ కప్ లో అదరగొడుతున్నాడు. శనివారం (జనవరి 17) బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో విహాన్ అద్భుతమైన స్పెల్ తో మ్యాచ్ ను గెలిపించాడు. ఛేజింగ్‌లో బంగ్లా 17.2 ఓవర్లకు 90/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ టైమ్‌లో వర్షం వచ్చి గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఆట ఆగింది. దాంతో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 రన్స్ గా సవరించారు. ఆట తిరిగి మొదలయ్యాక ఇండియా బౌలర్లు అద్భుత పెర్ఫామెన్స్ చేశారు. ఫిఫ్టీ పూర్తి చేసుకొని జోరు మీదున్న అజిజుల్ హకీం (51)ను ఔట్ చేసిన ఖిలాన్ పటేల్ కీలక బ్రేక్ ఇచ్చాడు. ఇక్కడ నుంచి విహాన్ మల్హోత్రా షో సాగింది. మల్హోత్రా ధాటికి సిద్దిఖీ (15), జిబాన్ (7) రిజాన్ (15), సుమియున్ (2) పెవిలియన్ బాట పట్టడంతో బంగ్లా 28.3 ఓవర్లలో 146 రన్స్‌కు ఆలౌటై ఓడిపోయింది. మ్యాచ్ ను గెలిసిపించిన విహాన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఓవరాల్ గా ఈ మ్యాచ్ లో విహాన్ మల్హోత్రా 4 ఓవర్లలో 14 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ లో 19 ఏళ్ళ విహాన్ ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బేస్ ప్రైస్ రూ. 30 లక్షలకు దక్కించుకుంది. గత సీజన్ లో జరిగిన మెగా ఆక్షన్ లో ఆర్సీబీ కొన్న ఆటగాళ్లు అందరూ అద్భుతంగా రాణించారు. ఈ సారి కూడా 2026 సీజన్ కు ముందు ఆర్సీబీ ప్లేయర్స్ ఆకట్టుకుంటున్నారు.

**బంగ్లాపై ఇండియా థ్రిలింగ్ విక్టరీ:**

అండర్-19 వరల్డ్ కప్‌లో యంగ్ ఇండియా వరుసగా రెండో విజయం సొంతం చేసుకుంది. ఓటమి ఖాయం అనుకున్న దశలో స్పిన్నర్ విహాన్ మల్హోత్రా (4/14) చేసిన మ్యాజిక్‌తో శనివారం జరిగిన గ్రూప్‌బి మ్యాచ్‌లో 18 రన్స్ తేడాతో (డక్‌వర్త్ లూయిస్) బంగ్లాదేశ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. వర్షం అంతరాయం కలిగించడంతో 49 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 48.4 ఓవర్లలో 238 రన్స్‌కు ఆలౌటైంది. అభిజ్ఞాన్ కుందు (112 బాల్స్‌లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 80), యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (67 బాల్స్‌లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 72) సత్తా చాటారు. బంగ్లాదేశ్ పేసర్ అల్ ఫహాద్ (5/38) ధాటికి కెప్టెన్ ఆయుష్ మాత్రే (6), వేదాంత్ (0), విహాన్ (7), హర్వాన్ష్ (2), అంబరీష్ (5) పెవిలియన్‌కు క్యూ కట్టినా.. వైభవ్, కుందు జట్టును ఆదుకున్నారు. అనంతరం ఛేజింగ్‌లో బంగ్లా 17.2 ఓవర్లకు 90/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ టైమ్‌లో వర్షం వచ్చి గ్రౌండ్ చిత్తడిగా మారడంతో ఆట ఆగింది. దాంతో బంగ్లా టార్గెట్‌ను 29 ఓవర్లలో 165 రన్స్ గా సవరించారు. 165 పరుగుల టార్గెట్ లో బంగ్లాదేశ్ 146 పరుగులు ఆలౌటైంది.

# కోహ్లీ వీరోచిత సెంచరీ... అయినా ఓడిపోయిన టీమిండియా... కివీస్ దే సిరీస్

- **మూడో వన్డేలో టీమిండియాపై న్యూజిలాండ్ ఘన విజయం**
- **1-2 తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్**
- **విరాట్ కోహ్లీ అద్భుత శతకం వృథా**
- **డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ సెంచరీలతో చెలరేగిన కివీస్**
- **రాణించిన యువ ఆటగాళ్లు నితీశ్ రెడ్డి, హర్షిత్ రానా**







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ జట్టు వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇండోర్ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియాపై 41 పరుగుల తేడాతో కివీస్ విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో చేజిక్కించుకుంది. విరాట్ కోహ్లీ అద్భుత శతకంతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు కివీస్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. డారిల్ మిచెల్ (137), గ్లెన్ ఫిలిప్స్ (106) అద్భుత శతకాలతో చెలరేగడంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. టాప్ ఆర్డర్ విఫలమైనా, విరాట్ కోహ్లీ (124) ఒంటరి పోరాటం చేశాడు. కాగా, కోహ్లీకి వన్డేల్లో ఇది 54వ సెంచరీ. అతనికి యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి (53), హర్షిత్ రానా (52) అర్ధశతకాలతో అండగా నిలిచారు. అయినప్పటికీ, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌట్ అయి ఓటమిపాలైంది.

కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్, జాకరీ ఫౌల్క్స్ చెరో మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

# చీరకట్టులో సంయుక్త అందాలు.. ఆ సోయగానికి ఫిదా!



సంయుక్త మీనన్.. పవన్ కళ్యాణ్ హీరోగా రానా కీలక పాత్రలో పోషిస్తూ వచ్చిన భీమ్లా నాయక్ సినిమాలో రానాకి జోడిగా.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇకపోతే పలు చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన ఈమె గత ఏడాది బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ సీక్వెల్ అఖండ 2 సినిమాలో నటించి తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఇక ఈ ఏడాది శర్వానంద్ హీరోగా వచ్చిన నారీ నారీ నడుమ మురారి సినిమాలో హీరోయిన్గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఈ సినిమా మంచి కామెడీ ఎంటర్టైన్మెంట్ మూవీ అని చెప్పవచ్చు.

ఇకపోతే ప్రస్తుతం సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి వచ్చిన నేపథ్యంలో మరొకవైపు తన అందంతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా పట్టుచీర కట్టుకొని అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా భిన్నభిన్నమైన ఫోజులు ఇస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. సింపుల్ హెయిర్ స్టైల్ తో జడలో మల్లె పువ్వులు పెట్టుకొని చేతిలో తామర పువ్వు పట్టుకొని ఏదో ఆలోచిస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా పెద్ద జుంకాలతో తన అందాన్ని రెట్టింపు చేసుకున్న ఈమె మెడలో ఏమీ లేకపోయినా తన అందంతో అభిమానులను ఆకట్టుకుంది..మొత్తానికైతే సంయుక్త మీనన్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారుతున్నాయి. 2016లో పాప్ కార్న్ అనే మలయాళం చిత్రంతో హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తమిళ్, కన్నడ, తెలుగు సినిమాలలో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. భీమ్లా నాయక్ సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఈమె.. కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసారా సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తర్వాత కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సార్. ఈ సినిమాలో టీచర్ పాత్రలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక ఆ తర్వాత వచ్చిన విరూపాక్ష సినిమాలో మరోసారి తన నటనతో మంచి మార్కులు వేయించుకుందని చెప్పవచ్చు. హీరోయిన్గా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇందులో డెవిల్ పాత్రలో అందరిని భయపెట్టేసింది. అలా తన పర్ఫామెన్స్ తో మెప్పిస్తున్న ఈమె ఇప్పుడు నారి నారి నడుమ మురారి చిత్రంలో మరోసారి మెప్పించింది. ఇక ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు సినిమాలో నటిస్తోంది. ఇందులో మరో హీరోయిన్ నభా నటేష్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక తర్వాత మహారాగ్ని అనే హిందీ సినిమాలో నటిస్తోంది. అంతేకాకుండా రామ్ అనే మలయాళం చిత్రంలో నటిస్తున్న ఈమె.. బెంజ్ అనే తమిళ చిత్రంలో కూడా నటిస్తోంది. అంతేకాదు విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ కాంబినేషన్లో వస్తున్న స్లమ్ డాగ్ అనే సినిమాలో కూడా హీరోయిన్గా నటిస్తోంది.

# అనీల్ 10వ సినిమా కోసం 50 రోజులా!

డైరెక్టర్లలలో వేగంగా కథ రాసి సినిమా పూర్తి చేసే దర్శకుడు ఎవరు? అంటే మొన్నటి వరకూ అంతా డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ పేరు జపించేవారు. కానీ పూరి ఫెయిల్యూర్స్ లో ఉండటంతో పాటు, స్పీడ్ కూడా తగ్గించడంతో? ఇప్పుడా స్థానాన్ని కోల్పోయారు. ఆ స్థానంలో హిట్ మెషిన్ అనీల్ రావిపూడి ఆక్రమించాడు. అనీల్ ఇప్పటి వరకూ తొమ్మిది సినిమాలు డైరెక్ట్ చేసాడు. అవన్నీ బ్లాక్ బస్టర్లే. కమర్శియల్ గా మంచి వసూళ్లను సాధించాయి. ఈ సినిమాల షూటింగ్ అంతా కూడా వేగంగా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాడు. దాదాపు అన్ని సినిమాలు నెలల వ్యవధిలోనే పూర్తి చేసి రిలీజ్ చేసాడు. ఈ సినిమాల స్టోరీలు సిద్ధం చేయడం కోసం అనీల్ తీసుకున్నది చాలా తక్కువ సమయమే. ఒకే ఒక్క సినిమా స్టోరీ సిద్ధం చేయడం కోసం మూడు నెలలు సమయం కేటాయించిగా, మిగతా ఎనిమిది సినిమాలకు నెలలోపే కేటాయించాడు. ఇటీవలే రిలీజ్ అయిన -మన శంకరవరప్రసాద్ గారు- కథకు అనీల్ తీసుకున్న సమయం కేవలం 25 రోజులే. వైజాగ్ పార్క్ హోటల్ లో సిట్టింగ్ వేసి 25 రోజుల్లోనే స్టోరీ సిద్ధం చేసి హైదరాబాద్ వచ్చాడు. ఇప్పుడాసినిమా వందల కోట్ల వసూళ్లు దిశగా దూసుకుపోతుంది. 25 రోజుల్లోనే ఇంత గొప్ప కథ రాసిన అనీల్ ఇంకా ఎక్కువ సమయం కేటాయిస్తే ఇంకా మంచి కథ రాస్తాడు కదా? అన్న సందేహం చాలా మందిలో ఉంది. కానీ అనీల్ అందుకు వ్యతిరేకం. తాను నమ్మిన ఫార్మెట్ ని మాత్రం ఎప్పటికీ వదలనంటున్నాడు. స్టోరీ విషయంలో రోజుల్లోనూ పూర్తి చేయాలన్నది అతడి ప్లాన్. ఈ నేపథ్యంలో అనీల్ 10వ సినిమా స్టోరీ అప్ డేట్ కూడా తెరపైకి వస్తోంది. ఈ సినిమా కోసం అనీల్ 50 రోజులు సమయం కేటాయించాలనుకుంటున్నాడుట. 45 నుంచి 50 రోజుల మధ్యలో పూర్తయ్యే అవకాశం ఉందంటున్నారు. అదే పార్క్ హోటల్ బీచ్ ముందు కూర్చుని స్టోరీ సిద్ధం చేయనున్నాడు. మరో రెండు వారాల తర్వాత అనీల్ నేరుగా వైజాగ్ చేరుకుంటాడని సన్నిహితుల నుంచి తెలిసింది. ఈసారి కూడా కథ పరంగా చాలా సింపుల్ గానే ఉంటుందని..హీరో ఇమేజ్ ఆధారంగా స్టోరీ సిద్ధం చేసే అవకాశాలున్నాయంటున్నారు. హీరో ఎవరు? అన్నది అనీల్ కూడా ఫిక్సై అయ్యాడన్నది తాజా అప్ డేట్. అయితే ఆ హీరో పేరు మాత్రం రివీల్ చేయలేదు. స్టోరీ పూర్తయిన తర్వాత ఆ హీరోకి నేరేట్ చేసే వరకూ ఆ వివరాలు గోప్యంగా ఉంటాయంటున్నారు. ఈ కథలో కూడా హీరో ఇన్వాల్వ్ మెంట్ ఉండదని అనీల్ పూర్తి స్వేచ్ఛతో చేసే మరో ఎంటర్ టైనింగ్ స్క్రిప్ట్ గానే ఉంటుందని అంటున్నారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఫిబ్రవరిలో బయటకు వచ్చే అవకాశం ఉంది. అయితే అనీల్ హీరోగా ఇప్పటికే కింగ్ నాగార్జునను ఫిక్సైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965